VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ :ఆదివారం 27.09.2026
సంపుటి : 09 సంచిక : 106, పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com

## బీఆర్ఎస్‌కు షాక్..?

### బీజేపీ వైపు మల్లారెడ్డి అడుగులు..?

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి పార్టీ మార్పుపై ఊహాగానాలు మళ్లీ జోరందుకున్నాయి.

ఆస్ట్రేలియా వెలుతురు సెప్టెంబర్ 26:

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు "భారత రత్న" ఇవ్వాలి

- ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి
- కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను నిజం చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్ లో ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కొన్ని సమయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ అంశాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతామన్నారు. పార్ల మెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించాలని రాజ్యసభ సభ్యులకు సూచించారు.

▶ మిగతా2లో

## రిఫరీపైనే అనుమానం వస్తే... ప్రజాస్వామ్యానికే ప్రమాదం

- ఎన్నికల సంఘం స్వతంత్రతపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి
- ఓటరు జాబితా ప్రభుత్వ ఆస్తి కాదు... ఓటు అధికార పార్టీ సొత్తు కాదు
- సాంకేతిక వ్యవస్థ పేరుతో ఒక్క అర్హుడి ఓటు హక్కును అడ్డుకున్నా అది ప్రజాస్వామ్యంపై దాడే
- ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై నిష్పాక్షిక విచారణ జరపాలి
- ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:

ఎన్నికల పోరులో అన్ని రాజకీయ పార్టీలూ ఆటగాళ్లయితే... ఎన్నికల సంఘం రిఫరీ. ఆ రిఫరీపైనే అనుమానం తలెత్తితే ఓడిపోయేది ఏదో ఒక రాజకీయ పార్టీ కాదు——మొత్తం ప్రజాస్వామ్యమేనని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. భారత ఎన్నికల సంఘం పనితీరుపై తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు ఓటు విలువను గుర్తించే ప్రతి భారతీయుడినీ కలవరపరుస్తున్నాయని అన్నారు.స్వతంత్ర ఎన్నికల సంఘం అనేది అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన రక్షణ కవచమని స్పష్టం చేశారు. ఆ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందా లేదా అనే తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు.నినాదాలు, మొండి ఖండనలు, గుడ్డిగా నమ్మాలనే ఆదేశాలతో అనుమానాలు తొలగిపోవని పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైన దర్యాప్తు కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల వ్యవధిలో కనీసం 14 అంశాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైందన్నారు.

## రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదు: కల్వకుంట్ల కవిత

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పసిపిల్లల మరణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- వైద్యం, విద్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ
- అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే రూపాయి ఎక్కువ ఉన్నా తిరిగి ఇస్తా

హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 26:

రాష్ట్రంలో వైద్య, విద్యా రంగాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.

## పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- విడతల వారీగా ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జనగామ వెలుతురు సెప్టెంబర్ 26:

పేదవాడి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదింటి ఆడబిడ్డ కుటుంబంలో చిరునవ్వు చూడాలన్న తపనతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శనివారం, జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గల ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్ లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ శాసన సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బూష పర్వతాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్, జనగామ, బనుక శివరాజ్ యాదవ్, డీసీసీ అధ్యక్షురాలు, జనగామ ఎల్. ధన్వంతి నాయక్, వైటీడీఏ సభ్యులు ఎల్. లక్ష్మీనారాయణ నాయక్ లతో కలిసి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరై, తెలంగాణ రాష్ట్ర గీతావళిని ఆలపించారు.

## వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థులకు శుభవార్త.. టీజీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంపు!

- ఓయూ క్యాంపస్ నుంచి వీసీఐడబ్ల్యూయూకు మెరుగైన రవాణా సౌకర్యం

హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:

విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGRTC) కీలక నిర్ణయం తీసుకుంది. ఉస్మానియా యూనివర్సిటీ (OU) క్యాంపస్ మీదుగా వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వ విద్యాలయం (VCIWU), కోటి వరకు నడిచే బస్సుల ఫ్రీక్వెన్సీని పెంచింది. పెంచిన బస్సు సర్వీసులు సెప్టెంబర్ 27, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి.

▶ మిగతా2లో

## 'సర్' పై అనుమానాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం..

- ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి
- మా ఆరోపణలకు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలు బలం చేకూరుస్తున్నాయి..

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:

## ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం: మంత్రి సీతక్క

- రూ.1,000 కోట్లతో 5,118 భవనాల నిర్మాణం
- 3,269 భవనాల పనులు 70 శాతం పూర్తి
- ఈ ఏడాదిలో అన్ని భవనాల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం
- 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు — రూ.800 కోట్లు

రంగారెడ్డి, వెలుతురు, సెప్టెంబర్ 26:

# రిఫరీపైనే అనుమానం వస్తే... ప్రజాస్వామ్యానికే ప్రమాదం

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైన దర్యాప్తు కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల వ్యవధిలో కనీసం 14 అంశాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు–పునరుద్ధరణ, అప్పీళ్ల పరిష్కారం, ఓటరు జాబితాల డేటాపై నియంత్రణ వంటి అత్యంత కీలకమైన అంశాలపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు ఆ కథనం పేర్కొందని తెలిపారు. “ఇవి కార్యాలయంలో జరిగే చిన్నచిన్న అభిప్రాయ భేదాలు కావు. ఎవరి పేరు ఓటరు జాబితాలో చేరాలి? ఎవరి పేరు తొలగించాలి? తప్పుగా తొలగించిన పేరును ఎవరు, ఎలా తిరిగి చేర్చాలి? ఓటరు డేటాపై అసలు నియంత్రణ ఎవరిది? అనే ప్రశ్నలు ఇవి. అంటే ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటు హక్కుతో ముడిపడిన అంశాలు” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. చట్టబద్ధంగా బాధ్యతలు నిర్వహించే ఎన్నికల అధికారులకు తెలియకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారా? ఓటరు డేటాబేస్‌ను పూర్తిగా కేంద్రీక రించడం ద్వారా క్షేత్రస్థాయి అధికారుల అధికారాలను పరిమితం చేశారా? కొత్త ఓటర్ల నమోదును ప్రభావితం చేసే మార్పులు ఎన్నికల కమిషనర్ల పూర్తి అవగాహన లేకుండానే జరిగాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందన్నారు. గోవాలో వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్న ఘటన మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. 97 మంది ఓటర్ల అర్హతను ఎన్నికల నమోదు అధికారులు పరిశీలించి నిర్ధా రించినప్పటికీ, సాఫ్ట్‌వేర్‌లో వారి నిర్ణయాలను సకాలంలో నమోదు చేయలేకపోవడంతో ఆ పేర్లు తుది జాబితాలో చేరలేదని వచ్చిన కథనాన్ని ఆయన ప్రస్తావించారు. “ఓటర్ల సంఖ్య 97 కావచ్చు... తొమ్మిది కావచ్చు... ఒక్కరు కావచ్చు. సంఖ్య చిన్నదని హక్కు చిన్నది కాదు. పౌరుడి పత్రాలను పరిశీలించి, అతను ఓటరుగా అర్హుడేనని చట్టబద్ధ అధికారి తేల్చిన తర్వాత కూడా ఒక కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ ఆ నిర్ణయాన్ని అమలు కాకుండా అడ్డుకుంటే—అది కేవలం సాంకేతిక లోపం కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థ వైఫల్యం” అని స్పష్టం చేశారు. “మనిషి కోసం సాంకేతికత ఉండాలి. సాంకేతికత కోసం మనిషి హక్కులను బలి ఇవ్వకూడదు. అధికారి నిర్ణయానికి సాఫ్ట్‌వేర్ సహకరించాలి. సాఫ్ట్‌వేరే అధికారిగా మారి ఓటు హక్కును అడ్డుకోకూడదు” అని అన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తొలగించిన వారిలో 22.21 లక్షల మంది తమ పేర్లను పునరుద్ధరించాలని అప్పీలు చేసుకున్నట్లు ఎన్నికల సంఘమే సుప్రీంకోర్టుకు తెలిపిందని గుర్తుచేశారు. ఈ గణాంకాల ఆధారంగా తొలగించిన ప్రతి పేరు తప్పేనని చెప్పలేమని, అయితే ఇంత భారీ స్థాయిలో పేర్లు తొలగించినప్పుడు పారద ర్శకత, సమర్థమైన అప్పీల్ వ్యవస్థ, సకాలంలో తప్పులను సరిచేసే అవకాశం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. “ఓటరు జాబితాలో జరిగిన తప్పును ఎన్నికల తర్వాత సరిచేస్తే ప్రయోజనం ఏమిటి? ఓటు వేసే రోజుకు ముందే న్యాయం జరగాలి. గడువు ముగిసిన తర్వాత పేరు చేర్చడం అంటే రైలు వెళ్లిపోయిన తర్వాత టికెట్ ఇవ్వడమే” అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం నియామక ప్రక్రియపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గతంలో వ్యక్తం చేసిన ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ప్రధానమంత్రి సూచించే కేంద్ర మంత్రిని సభ్యుడిగా చేర్చడం ద్వారా ఎంపికలో కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయాత్మక ఆధిపత్యం కల్పించారని ఆరోపించారు. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నందున, తీర్పు వచ్చే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకాన్ని వాయిదా వేయాలని రాహుల్ గాంధీ సూచించినప్పటికీ కేంద్రం పట్టించుకోలేదన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే విషయంలో ప్రభుత్వం తొందరపడి ముందుకు వెళ్లిందని చెప్పారు. “నియామక విధానాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారు. ఎంపిక కమిటీలో తమకే మెజారిటీ ఉండేలా చేసుకుంటారు. ఆ తర్వాత ఎన్నికల సంఘం నిష్పాక్షి కతను ఎవరూ ప్రశ్నించకూడదంటారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యం? విశ్వాసం అడిగితే వచ్చేది కాదు... పారద ర్శకతతో సంపాదించుకోవాలి” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. “నేను వరుసగా ఏడు ఎన్నికల్లో ప్రజల తీర్పుతో విజయం సాధించాను. దశాబ్దాల ప్రజాజీవితంలో గత ఎన్నికల సంఘాలకు ప్రజల్లో ఉన్న గౌరవాన్ని చూశాను. నాడు తీర్పు మనకు అనుకూలంగా వచ్చినా, వ్యతిరేకంగా వచ్చినా–రిఫరీ పక్షపాతం చూపలేదనే నమ్మకం ఉండేది. ఆ నమ్మకమే స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలకు పునాది. ఇప్పుడు ఆ పునాదిపైనే అనుమానాల నీడ పడుతోంది” అని పేర్కొన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేవనె త్తినట్లు చెబుతున్న అభ్యంతరాలు మొత్తం పరిణామాల్లో ఒక భాగం మాత్రమేనని, చివరకు నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణ సరిపోదన్నారు. “ఏకగ్రీవం అని ఒక్క మాట చెబితే అభ్యంతరాలు మాయమైపోవు. అసలు అభ్యంతరాలు ఎందుకు వచ్చాయి? వివాదాస్పద నిర్ణయాలను ఎవరు అనుమతించారు? ఇద్దరు కమిష నర్లను ముందుగానే సంప్రదించారా? చట్టబద్ధ అధికా రులకు ఓటరు డేటాబేస్‌పై స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఉందా? సాఫ్ట్‌వేర్ వైఫల్యంతో హక్కు కోల్పోయిన ఓటర్లకు ఏ రక్షణ కల్పించారు? ఈ ప్రశ్నలకు ఒక్కొక్కటిగా సమాధానం చెప్పాలి” అని డిమాండ్ చేశారు. ఎన్నికల స్వచ్ఛతను, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో దృఢంగా పోరాడుతుందని ప్రకటించారు. కమిషనర్లు సంధు, జోషి పేరుతో వెలుగులోకి వచ్చిన అభ్యంతరాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ బహిరంగంగా సమాధానం చెప్పాలని కోరారు. వివాదాస్పద నిర్ణయాలకు బాధ్యులెవరో వెల్లడించడంతోపాటు అర్హులైన ఓటర్లు పరిపాలనా లేదా సాంకేతిక అడ్డంకుల వల్ల జాబితా నుంచి తప్పిపోకుండా తీసుకుంటున్న చర్యలను దేశ ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నియామకంలో నిజమైన స్వతంత్రతను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వెలుగులోకి వచ్చిన అభ్యంత

రాలతోపాటు ఓటరు జాబితాల నిర్వహణకు ఉపయో గిస్తున్న సాంకేతిక వ్యవస్థల పనితీరుపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. “రాజ్యాంగ పదవికి గౌరవం కుర్చీ వల్ల రాదు... ప్రజల విశ్వాసం వల్ల వస్తుంది. ఆ విశ్వాసమే తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు బాధ్యత వహిం చాల్సిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి. వెలుగులోకి వచ్చిన అంశా లన్నింటిపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరగాలి” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. “ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ఎన్నికల ప్రక్రియను నమ్మమని ప్రజలను ఆదేశించలేరు. ఎన్నికల సంఘం బీజేపీ చేతిలోని పరికరం కాదు. ఓటరు జాబితా కేంద్ర ప్రభుత్వ ఆస్తి కాదు. ఓటు అధికార పార్టీ సొత్తు అసలే కాదు. ఓటు ఈ దేశ ప్రజల హక్కు... ఆ హక్కును కాపాడ టం రాజ్యాంగ వ్యవస్థల బాధ్యత”ఆయన తేల్చి చెప్పారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు “భారత రత్న” ఇవ్వాలి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

**భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం**

భారత దేశం గర్వించదగ్గ జాతిరత్నం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. వారి స్ఫూర్తిని భావిత రాలకు అందించాలన్న సంకల్పంతోనే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించు కున్నట్లు తెలిపారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు ఆయన వన్నె తెచ్చారన్నారు. 1991 లో దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ పనిచేశారని, అప్పుడు ఆయన తీసుకువచ్చిన సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకునేలా చేశాయని గుర్తు చేశారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని సీఎం తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సంస్థలు హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి సేవలు అందిస్తున్నాయని, అలాంటి ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సముచితం అని భావించామని ముఖ్యమంత్రి చెప్పారు.

**తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర నెహ్రూ-పటేల్, సోనియా-మన్మోహన్**

చరిత్రలో తెలంగాణను రెండు భాగాలుగా చూస్తుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో కలిపి స్వాతంత్ర్యం అందించిన ఘనత తొలి ప్రధాని నెహ్రూ, వల్లభాయ్ పటేల్ ది అయితే... దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ది అని సీఎం గుర్తు చేశారు. అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆయన చేసిన సంతకాన్ని ఇక్కడ పదిలపరిచామని సీఎం తెలిపారు. మన్మోహన్ సింగ్ ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూసేకరణ, పునరావాస చట్టం 2013 తీసుకొచ్చిన ఘనత సోనియా, మన్మోహన్ సింగ్ ఘనత అని తెలిపారు. భూమి కలిగిన వారితో పాటు భూమిలేని పేదలకు కూడా నష్ట పరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం ద్వారా హక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకువచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పూరిగుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

**జనగామ వెలుతురు సెప్టెంబర్ 26:**

ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్ర మాలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పేదల గుమ్మానికి చేర్చే బాధ్యతతో ప్రభుత్వం ముందుకు సాగు తోందన్నారు. అదనంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను గణనీయంగా పెంచామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ విద్యాసం స్థలను నిర్మిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి సమానంగా 3,500 ఇళ్లు మంజూరు చేశామని, జనగామ నియోజకవర్గానికి కూడా అదే విధంగా ఇళ్లు ఇచ్చామని తెలిపారు. లబ్ధిదారులు నిర్మాణ పనులు చేసిన దశలను బట్టి ప్రతి సోమవారం వారి ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ప్రతి నియోజకవ ర్గానికి మరో 2,000 ఇళ్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో పూరిగు డిసెలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుగా పూరిళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. జనగామ నియో జకవర్గంలో గుర్తించిన 500 పూరిళ్ల కుటుంబాలకు ఈ వేదికపై నుంచే రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లు, స్లాబ్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్లను కూల్చకుండా పూర్తి చేసుకు నేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని కూడా రెండో విడతలో అమలు చేస్తున్నామని చెప్పారు. మూడో విడత, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు పంపిణీ చేసి, తదుపరి విడతల్లో అక్కడ కూడా ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిది ద్దాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా సున్నా వడ్డీ రుణాలు అందించామని చెప్పారు. గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి, లబ్ధిదా రులకు అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జనగామలో ఇందుకు అవసరమైన రూ.2 కోట్లను వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దసరా నాటికి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను నివాసయోగ్యంగా అందిస్తామని తెలిపారు. జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి మొదటి విడతగా రూ.25 కోట్లు వెంటనే మంజూరు చేస్తామని, ఇప్పటికే శంకుస్థాపన చేసిన రూ.58–60 కోట్ల అభివృద్ధి పనులు, టెండర్లు పూర్తయిన రూ.19 కోట్ల పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని కొనసాగిస్తున్నామని, వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తు న్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 14–15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, అర్హులైన ఏ ఒక్క కుటుంబం కూడా ఇందిరమ్మ ఇల్లు విషయంలో నిరాశ చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని

మంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుందని, ఈ కాలంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ప్రజాపాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఇంకా రాష్ట్రంలో పరిష్కరిం చాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయని, వాటి పరిష్కార దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అప్పుల భారం ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంతో ఏర్పడిందని గుర్తు చేస్తూ, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతోనే తెలంగాణ ఏర్పడిందన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో అర్హులైన పేదలకే ఇళ్లు అందించాలన్నారు. అర్హత లేని వారు ఉంటే తొలగించి, నిజమైన అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. ఈ క్రమంలో జనగామ శాసనసభ్యులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో జనగామ మున్సిపాలిటీ అత్యంత పురాతన మున్సిపాలిటీ అని పేర్కొంటూ, మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏడు నెలల క్రితం జనగామ మున్సిపాలిటీ పరిధిలో రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులు మంజూరై టెండర్లు పూర్తయ్యాయని, ఆ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వడ్లకొండ–శామీర్‌పేట్ బైపాస్ రోడ్డును డబుల్ లైన్ చేయాలని కోరారు. అలాగే చీటకోడూరు బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని, గండిరామారం పంపులను మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే రెండో దశలో అదనంగా మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన నిరు పేదలకు ఇళ్లు మంజూరు చేసి, అందించాలన్నారు. అనంతరం జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ.. 2008 సంవత్సరం నుంచి తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చీటకోడూరు డ్యామ్ పరిసర ప్రాంతాల ప్రజల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. జనగామ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఈ పనుల ద్వారా జనగామ మున్సిపాలిటీని అందరికీ ఆదర్శప్రాయమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. తదనంతరం 500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఓలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థులకు శుభవార్త.. టీజీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంపు!

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

ఈ నిర్ణయంతో ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో నివసిస్తున్న పీజీ విద్యార్థులతో పాటు, వీసీఐడబ్ల్యూకు రాకపోకలు సాగించే ఇతర విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి మరింత మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. రోజువారీ ప్రయాణంలో ఇబ్బందులు తగ్గడంతో పాటు విద్యార్థులు విద్యా, ఇతర విశ్వవిద్యాలయ కార్యకలాపాలకు సకాలంలో హాజరయ్యేందుకు ఈ సర్వీసులు దోహదపడ నున్నాయి.వీసీ ఐడబ్ల్యూయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, యూనివర్సిటీ రవాణా అవస రాలపై సానుకూలంగా స్పందించి సహకరించిన గౌరవనీయులైన రోడ్లు, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి. నాగి రెడ్డి గారు, గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ అంచూరి శ్రీధర్ గారు, ఇతర అధికారులు అందించిన సహకారం, సానుకూల స్పందనకు ధన్యవాదాలు తెలిపారు.వీసీ ఐడబ్ల్యూయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ, బస్సుల ఫ్రీక్వెన్సీ పెంపుతో విద్యార్థులు, సిబ్బంది రోజువారీ రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, ప్రయాణంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు విద్యా, ఇతర

యూనివర్సిటీ కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యానికి ఇది ఉపయోగపడు తుందని తెలిపారు.యూనివర్సిటీ పరిపాలన టీజీఎస్ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెంచిన బస్సు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్–వీసీఐడబ్ల్యూయూ, కోటి మధ్య మెరుగైన బస్సు కనెక్టివిటీ విద్యార్థుల సౌకర్యం, భద్రత, సంక్షేమానికి మరింత దోహదపడుతుందని యూనివర్సిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.వీరానారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం

## బీఆర్ఎస్‌కు షాక్..? బీజేపీ వైపు మల్లారెడ్డి అడుగులు..?

**ఆస్ట్రేలియా వెలుతురు సెప్టెంబర్ 26:**

కొద్ది రోజులుగా మల్లారెడ్డి బీజేపీలో చేరతారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఆస్ట్రేలియా పర్యటనలో ఆయన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు రామచందర్ రావు, బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డితో కలిసి కని పించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియా లోని టూవూంబా మేయర్ జెఫ్ మెక్‌డొనాల్డ్‌ను ఈ ముగ్గురూ కలిసి మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ పరిణామాల నేపథ్యంలో మల్లారెడ్డి కమలం గూటికి ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

## ఐదు రోజులు బ్యాంకులు బంద్..

# సామాన్యుడి లావాదేవీలపై ప్రభావం ఎంత.?

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

బ్యాంకులో పని ఉందా..? చెక్కు క్లియర్ కావాల్సి ఉందా..? క్యాష్ డిపాజిట్ చేయాలా..? లోన్‌కు సంబంధించిన పని పెండింగ్‌లో ఉందా..? అయితే మీరు వేచి చూడక తప్పదు. ఎందుకంటే దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు మరోసారి సమ్మె బాట పట్టాయి. సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చారు. దీనికి ముందు సెప్టెంబర్ 26 నాలుగో శనివారం. దీంతో వరుస సెలవులు, దాంతో పాటు సమ్మె కారణంగా బ్యాంకింగ్ కార్యకలాపాలపై భారీ ప్రభావం పడుతుంది. దీంతో సామాన్యుడి పరిస్థితి అత్యంత గందరగోళంగా తయారయ్యింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏటీఎంలలో డబ్బు అందుబాటులో ఉంటుందా..? యూపీఐ పనిచేస్తుందా..? చెక్కుల పరిస్థితి ఏంటి..? బ్యాంకుల సమ్మె వెనుక అసలు కారణమేంటి..? సామాన్యుడిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న బ్యాంకుల బంద్ బాగోతం పై ప్రత్యేక కథనం. బ్యాంకులకు తాళం..? కస్టమర్లకు టెన్షన్..? సెప్టెంబర్ చివరి వారం... బ్యాంకు కస్టమర్లను కలవరపెడుతున్న అంశం... దేశవ్యాప్త బ్యాంకు సమ్మె. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపుతో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె జరగనుంది. ఇప్పటికే సెప్టెంబర్ 26 నాలుగో శనివారం కావడంతో బ్యాంకులు మూతపడతాయి. దీంతో మొదట వరుసగా ఐదు రోజులు బ్యాంక్ బ్రాంచ్ సేవలు అందుబాటులో ఉండవన్న ప్రచారం మొదలైంది. అయితే ప్రజలకు ఇబ్బందులు తగ్గించేందుకు సెప్టెంబర్ 27 ఆదివారం ప్రభుత్వ రంగ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను తెరవాలని కేంద్రం నిర్ణయించింది. అయినా ఉద్యోగ సంఘాల వైపు నుంచి దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఆదివారం సేవలు అన్ని చోట్లా సాధారణంగా ఉంటాయా అన్నది కస్టమర్లు ముందుగానే తమ బ్యాంకుతో నిర్ధారించుకోవడం మంచిది. అసలు సమ్మె ఎందుకు జరుగుతుంది..? బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్లలో మొదటిది వారానికి ఐదు రోజుల పని. ప్రస్తుతం బ్యాంకులకు ప్రతి నెల రెండో, నాలుగో శనివారాలు సెలవులు. అయితే మిగతా శనివారాలను కూడా సెలవులు గా ప్రకటించి... సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. దీనితో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర పెండింగ్ అంశాలు, ప్రోత్సాహక విధానాలపై కూడా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. డిమాండ్లపై పరిష్కారం రాకపోవడంతో, మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. కాగా సమ్మె జరిగితే సామాన్యుడికి ఎక్కడ ఇబ్బంది..? మొదటగా ప్రభావం పడేది బ్రాంచ్ ఆధారిత సేవలపైనే. కౌంటర్ వద్ద పెద్ద మొత్తంలో నగదు డిపాజిట్ చేయాలన్నా, నగదు తీసుకోవాలన్నా, చెక్కులను డిపాజిట్ చేయాలన్నా, డిమాండ్ డ్రాఫ్ట్ కావాలన్నా, బ్యాంకు డాక్యుమెంట్లు సమర్పించాలన్నా, ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా వ్యాపారులు... రోజువారీ నగదు లావాదేవీలు ఎక్కువగా చేసే వారు... బ్రాంచ్ సేవలపై ఆధారపడే వృద్ధులు... గ్రామీణ ప్రాంతాల ప్రజలపై ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. ఇటీవల సెప్టెంబర్ 11న జరిగిన సమ్మె సమయంలో కూడా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల కౌంటర్ సేవలు, నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్స్ లపై విపరీతమైన ప్రభావం పడింది. ఇదిలా ఉండగా బ్యాంక్ బ్రాంచ్ మూసుంటే మీ డబ్బు కూడా ఆగిపోతుందని అనుకోకండి. ఇక్కడే డిజిటల్ బ్యాంకింగ్ సామాన్యుడికి పెద్ద ఊరట. యూపీఐ

మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఐ ఎం పీ ఎస్, ఏటీఎం సేవలు సాధారణంగా కొనసాగుతాయని బ్యాంకులు చెబుతున్నాయి. అంటే గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, లేదా బ్యాంకుల లావాదేవీల యాప్స్ ద్వారా చేసే సాధారణ డిజిటల్ చెల్లింపులపై సమ్మె ప్రభావం చాలా తక్కువ. ఏటీఎంలలో కూడా నగదు అందుబాటులో ఉండేలా బ్యాంకులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు సమ్మె మూడు రోజుల్లో ఉచిత పరిమితిని మించి చేసే ATM లావాదేవీలపై కొన్ని అదనపు ఛార్జీలను కూడా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించాయి. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. UPI పనిచేస్తుంది కదా... బ్యాంకు అవసరమేంటి అని అనుకోవడం కూడా సరైనది కాదు. రోజువారీ టీ నుంచి కిరాణా బిల్లు వరకు UPIతో చెల్లించవచ్చు. కానీ పెద్ద మొత్తాల నగదు లావాదేవీలు, కొన్ని చెక్కుల క్లియరెన్స్‌లు, లాకర్లు, లోన్ డాక్యుమెంటేషన్, KYCకు సంబంధించిన కొన్ని పనులు బ్యాంకు అధికారుల అనుమతి అవసరమైన సేవలు... ఇవన్నీ ఇప్పటికీ బ్రాంచ్ వ్యవస్థతో ముడిపడి ఉన్నాయి. అందుకే మూడు రోజుల సమ్మె చిన్న విషయం కాదు. ప్రత్యేకంగా సెప్టెంబర్ చివరి రోజులు బ్యాంకులకు హాఫ్ ఇయర్లీ క్లోజింగ్ సమయం కావడం వల్ల కార్యకలాపాలపై అదనపు ఒత్తిడి ఉండొచ్చని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే బ్యాంక్ ఖాతా దారులు ఏం చేయాలి..? భయపడాల్సిన అవసరం లేదు. కానీ ముందుగా ప్లాన్ చేసుకోవాలి. బ్రాంచ్‌లో తప్పనిసరిగా చేయాల్సిన పని ఉంటే, మీ బ్యాంకు బ్రాంచ్ పనిచేస్తుందో లేదో ముందుగానే తెలుసుకోవాలి. అత్యవసర చెక్కులు... డాక్యుమెంట్ల సమర్పణ... క్యాష్ అవసరాలు... లోన్ సంబంధిత పనులను వీలైనంత ముందుగానే పూర్తి చేసుకోవడం మంచిది. డిజిటల్ బ్యాంకింగ్ ఉపయోగించేవారు... UPI PIN, OTP పేరుతో వచ్చే ఫేక్ కాల్స్, లింక్స్ పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలి. "బ్యాంకులు బంద్... వెంటనే KYC చేయండి" అంటూ వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకండి. ఒకప్పుడు... బ్యాంకు తలుపు మూస్తే... మన ఆర్థిక లావాదేవీ కూడా ఆగిపోయేది. ఇప్పుడు... చేతిలో ఒక మొబైల్ ఉంటే చాలు... సెకన్లలో డబ్బు ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు వెళ్తోంది. కాలం మారింది... బ్యాంకింగ్ మారింది... కానీ... బ్యాంక్ బ్రాంచ్ అవసరం మాత్రం పూర్తిగా తగ్గిపోలేదు. మూడు రోజుల సమ్మె... ఉద్యోగుల డిమాండ్లపై జరుగుతున్న పోరాటం ఒకవైపు... కస్టమర్లకు నిరంతర సేవలు అందించాల్సిన అవసరం మరోవైపు...సామాన్యుడికి ఇబ్బంది రాకుండా పరి ష్కారం రావాలన్నదే అందరి ఆకాంక్ష. కొస మెరుపు.. "బ్యాంకుకు తాళం పడొ చ్చు... కానీ మీ లావాదేవీలకు కాదు... ముందస్తు జాగ్రత్తే... మీ ఆర్థిక కార్యకలాపాలకు భరోసా!

## 'సర్' పై అనుమానాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం..

- **ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి**
- **మా ఆరోపణలకు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలు బలం చేకూరుస్తున్నాయి..**
- **సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి**
- **టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్....**
- **జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ తో నిరసనగా 28న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు...**
- **హైదరాబాద్ ట్యాంక్ అంబేద్కర్ విగ్రహం వద్ద 10.30 గంటలకు భారీ నిరసన**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న మొదటి నుచి అనేక అనుమానాలకు తావిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు..ఎన్నికల సంఘం ప్రవర్తిస్తున్న తీరుకు నిదసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ తో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు.హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వద్ద అంబెడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10.30 గంటలకు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు..ఈ విషయాలపై ఆయన ఒక ప్రకటన చేస్తూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడికి హక్కు అని పౌరుల హక్కులను కాపాడడం ఎన్నికల సంఘం కనీస బాధ్యత అని అన్నారు.గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై చీఫ్ ఎన్నికల కమిషనర్ ను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలు వెలుగులోకి వచ్చాయని వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో సర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బయటకు వచ్చిందని, ఈ ప్రక్రియలో తలెత్తిన అనుమానాలు, ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయాన అన్నారు. ఫారం-6లో చేసిన మార్పులపై ఇద్ద రు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేప థ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన Electoral Registration Officers (EROs) పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని, ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అత్యంత బాధ్యత యుతంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.SIR ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని, పేర్ల తొలగింపునకు కారణాలు ఏమిటి, ఎంత మంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబు దారీతనంతో ఉండేలా చూడాలని ఆయన అన్నారు.ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పకడ్బందీగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఎన్నికల సంఘం చర్యలను అనుమానిస్తున్నదని ఇప్పుడు ఇద్దరు కమిషనర్లు కూడా అవే అనుమానాలు వ్యక్తం చేయడంతో దేశంలో ఈ.సి కొంత కాలంగా చేసిన చర్యలు కేంద్రంలోని అధికార పార్టీకి లాభం చేకూర్చిందన్న అనుమానాలు మరింత బలపడ్డాయని అన్నారు. ఈ అంశాలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన, ఉద్యమాలకు ప్రజాస్వామ్య వాదులు, సంఘాలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచాలి: మంత్రి తుమ్మల

- **రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయాలు.. రవాణా భారం తగ్గేలా చర్యలు**
- **మూడు సంవత్సరాల్లో తెలంగాణలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం**

**వెలుతురు నర్మెట్ట, సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 26:**

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును పెద్ద ఎత్తున విస్తరించడంతో పాటు, రైతులకు పంటకు సంబంధించిన అన్ని రకాల మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను శనివారం మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి హైమావతి గారితో కలిసి సందర్శిం చారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో జరుగుతున్న FFB (Fresh Fruit Bunches) సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, నీటి లభ్యత, ప్లాంట్ నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### 70 వేల మెట్రిక్ టన్నులకు పైగా FFB ప్రాసెసింగ్...

నర్మెట్ట ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 70,000 మెట్రిక్ టన్నులకు పైగా FFBను ప్రాసెస్ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం 30 TPH సామర్థ్యంతో ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో FFB ఉత్పత్తి కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నర్మెట్ట ప్లాంట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 120 TPH వరకు విస్తరించుకునే అవకాశం ఉండటం ప్రయోజనకరమన్నారు.

### రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయం...

రైతులు పండించిన ఆయిల్‌పామ్ FFBను దూర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం లేకుండా, సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయం అందుబాటులో ఉండటం ఎంతో ప్రయోజనకరమని మంత్రి అన్నారు. FFBను కోత అనంతరం సాధ్యమైనంత త్వరగా ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించడం ద్వారా నాణ్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. రవాణా దూరం, సమయం తగ్గడంతో రైతులకు రవాణా పరంగా కూడా సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. ఆయిల్‌పామ్ రైతులకు సమీపంలోనే ప్రాసెసిం గ్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ మౌలిక వసతులను కూడా విస్తరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

### ఆయిల్‌పామ్ రైతులతో మంత్రి ముఖాముఖి...

ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాకు చెందిన ఆయిల్‌పామ్ రైతులతో మంత్రి ముఖాముఖిగా మాట్లాడారు. రైతుల తోటల నిర్వహణ, దిగుబడులు, కోతలు, FFB సేకరణ, రవాణా, ప్రాసెసింగ్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నంగునూర్ మండలం నంగునూర్ గ్రామానికి చెందిన శ్రీ మడప ఎల్లారెడ్డి 5 ఎకరాల్లో 60 టన్నుల దిగుబడి సాధించినట్లు తెలిపారు. మైసంపల్లి గ్రామానికి చెందిన శ్రీ ఓరుగంటి రాజిరెడ్డి 3 ఎకరాల్లో 32.5 టన్నులు, కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన శ్రీ పిన్‌రెడ్డి రాజిరెడ్డి 2.5 ఎకరాల్లో 9.6 టన్నులు, హుస్నాబాద్ మండలం కూచినపల్లి గ్రామానికి చెందిన శ్రీ బాపు రెడ్డి 3 ఎకరాల్లో 17 టన్నుల దిగుబడి సాధించినట్లు వివరించారు. నలుగురు రైతులు కలిపి 13.5 ఎకరాల్లో 119.1 టన్నుల దిగుబడి సాధించినట్లు తెలిపారు. రైతుల అనుభవాలను మంత్రి ఆసక్తిగా విని, ఆయిల్‌పామ్ తోటల్లో శాస్త్రీయ పద్ధతులు, సరైన నీటి యాజమాన్యం, సమయానుకూలంగా కోతలు, తగిన పంట నిర్వహణ పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన సౌకర్యాలు, భవిష్యత్‌లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

### మూడు సంవత్సరాల్లో 10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్...

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమైన వాతావరణం, భూములు, నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో సాగును మరింత ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సాగు విస్తీర్ణం పెరిగే కొద్దీ FFB ఉత్పత్తి కూడా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ ప్లాంట్లు, రవాణా, ఇతర మౌలిక వసతులను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంద న్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించడంతో పాటు, వారు పండించిన పంటను సకాలంలో ప్రాసెసింగ్ చేయించుకునేలా అవసరమైన సదుపాయాల ను కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు.

### నర్మెట్ట ప్లాంట్‌కు నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి...

నర్మెట్ట ప్రాసెసింగ్ ప్లాంట్‌కు అవసరమైన నీటి లభ్యతపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రస్తుతం వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్లాంట్‌కు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నర్మెట్ట ప్లాంట్‌కు అవసరమైన నీటిని థపాస్పల్లి రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ల నుంచి అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్లాంట్‌కు నిరంతరంగా నీరు అందుబాటులో ఉండేలా చూడటం ద్వారా FFB ప్రాసెసింగ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించవచ్చని, రైతుల నుంచి వచ్చే పంటను సకాలంలో ప్రాసెస్ చేయడానికి ఇది దోహదపడుతుందని మంత్రి అన్నారు.

### ఆయిల్‌పామ్ సాగు విస్తరణతో రైతులకు కొత్త అవకాశాలు...

తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా మంచి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు గణనీయంగా విస్తరించిందని, రానున్న రోజుల్లో మరింత విస్తరించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరించే ప్రాంతాల్లో రైతులకు సమీపంలోనే FFB ప్రాసెసింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతుల పంటకు మార్కెట్, రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలు సమర్థవంతంగా అం

దుబాటులో ఉంటేనే ఆయిల్‌పామ్ సాగు మరింత వేగంగా విస్తరించే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా FFB సేకరణ, ప్రాసెసింగ్...

రైతుల నుంచి FFB సేకరణ నుంచి ప్లాంట్‌కు రవాణా, ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో సమర్థవంతమైన వ్యవస్థ ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. రైతులు పండించిన పంటను సకాలంలో ప్లాంట్‌కు తరలించి, ఎలాంటి జాప్యం లేకుండా ప్రాసెసింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, రవాణా సౌకర్యం, ప్రాసెసింగ్‌కు సంబంధించిన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. నర్మెట్ట ప్లాంట్‌ను పరిశీలించిన సందర్భంగా FFB సేకరణ, రోజువారీ ప్రాసెసింగ్ సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ప్రాసెసింగ్, నీటి లభ్యత, ప్లాంట్ నిర్వహణ, భవిష్యత్‌లో పెరగనున్న FFB ఉత్పత్తికి అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచే అంశాలపై మంత్రి, జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, TG OIL FED అధికారులు, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్ అధికారులు, సిబ్బంది, ఆయిల్‌పామ్ రైతులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతికతతో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలి

- **తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేలా రైతులు నూతన సాగు పద్ధతులు అవలంబించాలి**
- **శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి**

**మెదక్, వెలుతురు సెప్టెంబర్ 26:**

రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకుని రైతులు అధిక ఆదాయం పొందే దిశగా ముందుకు సాగాలని అన్నారు.మెదక్ పట్టణంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి పొదుపు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. వ్యవసాయంలో నూతన పద్ధతులను పాటించడం ద్వారా ఉత్పాదకత పెంచడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు కేవలం అధిక దిగుబడులకే పరిమితం కాకుండా పండించిన పంటలకు సరైన మార్కెట్‌ను గుర్తించి మెరుగైన ధర పొందేలా ప్రణాళిక చేసుకోవాలని అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభు త్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారు లు తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని అన్నారు. రైతాంగ సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతిక విధానాలను వ్యవసాయంలో అవలంబించి ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు అధిక లాభాలు పొందాలని సూచించారు. కిసాన్ మేళాలో వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (FPOలు), వ్యవసాయ యాంత్రీకరణ సంస్థలు, విత్తనాలు, ఎరువుల సంస్థల

ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన స్టాళ్ల ద్వారా రైతులకు అవసరమైన సమాచారం, సాంకేతిక సూచనలు అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను మంత్రి, అధికారులు మరియు వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, FPO ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం: మంత్రి సీతక్క

- రూ.1,000 కోట్లతో 5,118 భవనాల నిర్మాణం
- 3,269 భవనాల పనులు 70 శాతం పూర్తి
- ఈ ఏడాదిలో అన్ని భవనాల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం
- 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు – రూ.800 కోట్లు
- హ్యామ్ రహదారుల పనులు గడువులోగా పూర్తి చేయాలి

**రంగారెడ్డి, వెలుతురు, సెప్టెంబర్ 26:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా స్యాచురేషన్ మోడ్‌లో నిర్మాణాలు చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రాష్ట్రంలో సొంత భవనాలు లేని 5,118 గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 3,269 భవనాల నిర్మాణ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈ ఏడాదిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశాన్ని మంత్రి సీతక్క నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆమె సమీక్షించారు.

### 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు

గ్రామ పంచాయతీ భవనాలతో పాటు రాష్ట్రంలోని 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం రూ.800 కోట్ల నిధులు మంజూరు చేశామని, ఇప్పటికే అనేక చోట్ల పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి వస్తే వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### హ్యామ్ విధానంలో 3,861 కి.మీ. గ్రామీణ రహదారులు

హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో తెలంగాణలో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని గ్రామీణ రహదారుల నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. హ్యామ్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నామని, ఇందుకోసం సుమారు రూ.3,382 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో చేపడుతున్న హ్యామ్ రహదారుల్లో సుమారు సగం ఈ నాలుగు జిల్లాల్లోనే ఉన్నందున అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు రహదారి నిర్మాణాలకు అనువైన కాలాన్ని పూర్తిగా వినియోగించుకుని పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం, నాణ్యత లోపాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో హ్యామ్ విధానంలో చేపడుతున్న గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలిస్తున్నాయని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల ప్రతినిధులు తెలంగాణకు వచ్చి ఈ విధానంపై వివరాలు తెలుసుకున్నారని మంత్రి తెలిపారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

### తాగునీటి సరఫరాపై ముందస్తు ప్రణాళిక

రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ నాలుగు జిల్లాల్లోని 19 రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, సింగూరు మినహా మిగిలిన రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేనందున ప్రత్యేక అధికారిని నియమించి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సింగూరుకు నిజాం సాగర్ నుంచి నీటిని తరలించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. సింగూరులో ప్రస్తుతం సుమారు 54 రోజులకు సరిపడా తాగునీటి నిల్వలు ఉన్నాయని, స్థానిక నీటి వనరులను వినియోగించుకోవడం ద్వారా సుమారు 75 రోజుల వరకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.

### ప్రతి మండలానికి డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ

వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీలు ఇప్పటి నుంచే మండలాల్లో పర్యటించి నీటి లభ్యతను అంచనా వేయడంతో పాటు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని సూచించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాలు, చెంచు పెంటల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

### ఉపాధి హామీ పనులకు ప్రాధాన్యం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని మంత్రి సూచించారు. ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలకు శాశ్వత ఆస్తులు సమకూరేలా పనులను ఎంపిక చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పనుల కోసం రూ.6 వేల కోట్ల బడ్జెట్ అందుబాటులో ఉందని, దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా గ్రామాల్లో మౌలిక వసతులు, నీటి సంరక్షణ పనులను చేపట్టాలని ఆదేశించారు. జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

### నిర్లక్ష్యంపై చర్యలు

అభివృద్ధి పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పనితీరు కనబరిచే అధికారులను ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా సంఘాల భవనాలు, గ్రామీణ రహదారులు, తాగునీరు, ఉపాధి హామీ, నీటి సంరక్షణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి , అదనపు కమిషనర్ రవీందర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, ఇంజినీరింగ్ అధికారు లు, ఎస్ఈలు, ఈఈలు, ప్రాజెక్ట్ మానిటరింగ్ అధికారులు, జాయింట్ కమిషనర్లు, హ్యామ్ రహదారుల కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# "బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దల భాగస్వామ్యం కీలకం"

- బాల్య వివాహ రహిత జిల్లాగా సంగారెడ్డిని తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి

**సంగారెడ్డి వెలుతురు సెప్టెంబర్ 26:**

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహ నిషేధ చట్టం–2006పై జిల్లాలోని మత పెద్దలకు అవగాహన కల్పించేందుకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "బాల్య వివాహంతో – బతుకు ఆగం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూజారులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలు, క్వాజీలతో పాటు సుమారు 100 మంది మత పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి లలిత కుమారి మాట్లాడుతూ, బాల్య వివాహాల నివారణలో మత పెద్దల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరపడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులతో పాటు వివాహాన్ని నిర్వహించే మత పెద్దలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వివాహం నిర్వహించే ముందు వధూవరుల పుట్టిన తేదీ, వయస్సు ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని మత పెద్దలకు సూచించారు. బాలికకు 18 సంవత్సరాలు, బాలుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం జరిపేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అన్ని మతాలకు చెందిన మత పెద్దల సహకారంతో సంగారెడ్డి జిల్లాను "బాల్య వివాహ రహిత జిల్లాగా" తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తామని ఆమె తెలిపారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ శ్రీ రాజా రెడ్డి మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలన ఒక్క శాఖ బాధ్యత కాదని, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, మత పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టగలమని అన్నారు. డి సి ఆర్ బి సి ఐ శ్రీ రమేష్ మాట్లాడుతూ, బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టంలోని నిబంధనల ప్రకారం శిక్షలు, జరిమానాలపై మత పెద్దలకు 0సి పి యు) శ్రీ రత్నం మాట్లాడుతూ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు మత పెద్దలు చురుకైన భాగస్వాములుగా మారాలని కోరారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీ ఉప్పలయ్య మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలన కోసం స్కోప్ సంస్థ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, బాలల రక్షణకు సంబంధించిన చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలతో కలిసి స్కోప్ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు శ్రీ వెంకటేశం, శ్రీ విష్ణుమూర్తి, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శ్రీ యాదగిరి, డి సి పి యూ సిబ్బంది లింగం, యాదగిరి, స్కోప్ సంస్థ సభ్యులు రామా గౌడ్, సావిత్రి, సవిత తదితరులతో పాటు సుమారు 100 మంది మత పెద్దలు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. బాల్య వివాహాలను అరికట్టి ప్రతి బాలబాలికకు విద్య, రక్షణ, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

# వై. సతీష్ రెడ్డిని పరామర్శించిన అనిల్ కుర్మాచలం

**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 24:**

తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రెడ్కో చైర్మన్ వై. సతీష్ రెడ్డిని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో కోలుకుంటున్న సతీష్ రెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులు సూచించిన మేరకు విశ్రాంతి తీసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. అనిల్ కుర్మాచలం వెంట బీఆర్ఎస్ యువజన నాయకుడు తిరుమందాస్ నరేష్ గౌడ్ ఉన్నారు.

# రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదు: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 26:**

శనివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పసిపిల్లల మరణాలపై ప్రభుత్వం సమగ్ర సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరిపాలనను సమర్థంగా నిర్వహించలేకపోతే బాధ్యతల నుంచి తప్పుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2020–21లో 6 వేల మంది, 2022–23లో 4,933 మంది, 2024–25లో 3,853 మంది పసిపిల్లలు మరణించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో రాష్ట్రంలోని వైద్య వ్యవస్థపై తనకు అందిన సమాచారం ఆందోళన కలిగించిందన్నారు. హైదరాబాద్‌లోనూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నారుల మరణాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. వైద్య రంగానికి బడ్జెట్‌లో 10 శాతం కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ స్థాయిలో నిధులు కేటాయించడం లేదని కవిత విమర్శించారు. గతేడాది వైద్య రంగానికి ₹13,192 కోట్లు కేటాయించగా, ₹9,242 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 11 ఆరోగ్య పథకాల్లో ఏడు పథకాలకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ఆరోగ్యశ్రీకి కేటాయించిన ₹700 కోట్లలో ₹140 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, పెండింగ్ బకాయిలను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిపై ఆందోళన

ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కవిత కోరారు. జిల్లా కలెక్టర్లు తరచూ ప్రభుత్వ ఆసుపత్రులు, సంక్షేమ హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. నీలోఫర్ ఆసుపత్రిలో బెడ్ ఆక్యుపెన్సీ అధికంగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, నిమ్స్‌లోనూ బెడ్లు, శస్త్రచికిత్సల కోసం నిరీక్షణ సమస్యలు ఉన్నాయని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు, వైద్య సదుపాయాల మెరుగుదలకు ఐటీడీఏ నిధులను వినియోగించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అవసరమైన పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### విద్య, వైద్యంపై ఉద్యమం

విద్య, వైద్య రంగాల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని కవిత అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వాస్తవ పరిస్థితులను ప్రజలు వెలుగులోకి తీసుకురావాలని, కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలల్లోని పారిశుధ్య సదుపాయాలపై నివేదికలు రూపొందించాలని సూచించారు. పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వ స్థలాలు పొందిన కార్పొరేట్ ఆసుపత్రులు ఒప్పందాల ప్రకారం సేవలు అందిస్తున్నాయా లేదా ప్రభుత్వం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

### ఆస్తులపై ఆరోపణలు నిరూపిస్తే తిరిగి ఇస్తా

తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క రూపాయి ఎక్కువగా తన వద్ద ఉన్నట్లు నిరూపించినా ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తానని కవిత అన్నారు. తన ఫామ్‌హౌస్ చట్టబద్ధంగానే నిర్మించుకున్నదని, కబ్జా భూమి, ఎఫ్‌టీఎల్ లేదా అసైన్డ్ భూమి లేదని పేర్కొన్నారు. తన ఆస్తులన్నీ చట్టబద్ధమైనవేనని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఫామ్‌హౌస్‌లకు సంబంధించి ఏర్పాటు చేసిన సిట్‌పై ఆమె విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ తదితర అంశాలపై ఏర్పాటు చేసిన దర్యాప్తు సంస్థల ద్వారా ఇప్పటివరకు ఏం సాధించారని ప్రశ్నించారు.

### ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. ప్రజలు తమ నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవాలని కోరారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో చిన్నపాటి క్లరికల్ తప్పిదాల కారణంగా ఓట్లు తొలగించకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న సభలో నెరేళ్ల బాధితుల సమస్యలపై కూడా మాట్లాడా లని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత నివేదికలు, చర్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

### చాకలి ఐలమ్మకు నివాళులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె చిత్రపటానికి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో బహుజన తెలంగాణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్. రూప్‌సింగ్, నవీన్ ఆచారి, మాధవి, శ్రీకాంత్ రావు, అర్చనా సేనాపతి, రాంకోటి, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- పరిశుభ్రత లోపాల గుర్తింపు.. ఆహార నమూనాల సేకరణ
- మూడు హోటళ్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసుల జారీకి సిఫార్సు

**సూర్యాపేట, సెప్టెంబర్ 26 (వెలుతురు):**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆదేశాల మేరకు అధికారులు 7 మిడ్‌వే ప్లాజా, రాయగూడెం, సూర్యాపేట, లిటిల్ విలేజ్ బిర్యానీ, అన్నపూర్ణ మెస్‌లను తనిఖీ చేశారు .ఈ తనిఖీల్లో ఆయా హోటళ్లలో ఆహార తయారీ, నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రమాణాలు సక్రమంగా పాటించకపోవడాన్ని అధికారులు గుర్తించారు. అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఆహార పదార్థాలను నిల్వ చేయడం, వంటగదులు, రిఫ్రిజిరేటర్లు సక్రమంగా శుభ్రపరచకపోవడం వంటి పలు లోపాలు బయటపడ్డాయి.అనుమానాస్పదంగా గుర్తించిన ఆహార పదార్థాల నుంచి అధికారులు నమూనాలను సేకరించి విశ్లేషణ కోసం ప్రయోగశాలకు పంపించారు. విశ్లేషణ నివేదిక అందిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.తనిఖీల్లో గుర్తించిన లోపాలపై 7 మిడ్‌వే ప్లాజా, లిటిల్ విలేజ్ బిర్యానీ, అన్నపూర్ణ మెస్‌లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయాలని జిల్లా డిజిగ్నేటెడ్ ఆఫీసర్‌కు అధికారులు సిఫార్సు చేశారు.ఆహార తయారీ ప్రదేశాలు, వంటగదులు, రిఫ్రిజిరేటర్లు, పరికరాలు, నిల్వ ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. ఆహార పదార్థాలను కీటకాలు, ఫంగస్, ఇతర కలుషితాలకు గురికాకుండా సురక్షితంగా నిల్వ చేయాలని స్పష్టం చేశారు.ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణా లను తప్పనిసరిగా పాటిస్తూ వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని హోటల్ నిర్వాహకులకు సూచించారు. నమూనాల విశ్లేషణ నివేదికలు, ఇంప్రూవ్‌మెంట్ నోటీసుల అమలును బట్టి తదుపరి చర్యలు చేపడతామని జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి తెలిపారు.

# గోపూలారంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, ఆరోగ్య అవగాహన శిబిరం

- ఐఎఫ్‌హెచ్‌ఈ కార్కినోస్ హెల్త్‌కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- తొలిరోజే 150 మందికి పైగా గ్రామీణులకు వైద్య పరీక్షలు

**శంకర్ పల్లి, వెలుతురు సెప్టెంబర్ 26 :**

గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు ఆరోగ్య అవగాహన కల్పించడం, వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా దొంతాన్ పల్లిలో గల ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనుబంధ విభాగాలైన సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్మెంట్, ఉన్నత భారత్ అభియాన్ మరియు కార్కినోస్ హెల్త్‌కేర్ సంయుక్తం గా మండల పరిధిలోని గోపులారం గ్రామంలో రెండు రోజుల 'కమ్యూనిటీ మెడికల్ వెల్నెస్ అండ్ క్యాన్సర్ అవేర్‌నెస్ డ్రైవ్'ను శనివారం ఘనంగా ప్రారంభిం చాయి.ఈ శిబిరాన్ని ఐఎఫ్‌హెచ్‌ఈ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. వినయ్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి ప్రారంభించారు. రిలయన్స్-కార్కినోస్ హెల్త్‌కేర్ సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, టాటా క్యాన్సర్ సెంటర్ (తిరుపతి) మాజీ డైరెక్టర్ డాక్టర్ నారాయణ మూర్తి పోదూరి నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించింది. ఇండియన్ క్యాన్సర్ సొసైటీ (బెంగళూరు) ప్రధాన ఆర్థిక భాగస్వామిగా వ్యవహరించిన ఈ శిబిరంలో కార్కినోస్ హెల్త్‌కేర్ సాంకేతిక, క్లినికల్ సేవలందించింది.

పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్న ఈ క్యాంప్‌లో క్యాన్సర్ అవగాహన, ముందస్తు గుర్తింపు పరీక్షలతో పాటు సాధారణ వైద్య సలహాలు, అవసరమైన వారికి తదుపరి చికిత్స కోసం రెఫరల్ సపోర్ట్ అందిస్తున్నారు. ఐఎఫ్‌హెచ్‌ఈ దత్తత తీసుకున్న గోపూరం, మహారాజ్ పేట్, పిల్లిగుడ్ల, ప్రొద్దుటూర్, దొంతంపల్లి గ్రామాలతో పాటు సమీప తాండాల నుంచి మొదటి రోజు 150 మందికి పైగా గ్రామస్తులు ఈ ఉచిత సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణ మూర్తి పోదూరి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అందరికీ క్యాన్సర్ సంరక్షణను అందుబాటులోకి తేవడంలో ఐఎఫ్‌హెచ్‌ఈ భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అసమానతలను తొలగించడంలో విద్యా, వైద్య సంస్థల పాత్ర కీలకమని ఐఎఫ్‌హెచ్‌ఈ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూబీఏ ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ అంజన్న మట్ట, జాయింట్ రిజిస్ట్రార్ వి. మధుసూదన్ రావు, మురళీధరన్ పసుల, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కర్నల్ జయంత సర్కార్, పలువురు అధ్యాపకులు, వైద్యులు పాల్గొన్నారు. కాగా, ఈ శిబిరం సెప్టెంబర్ 27 (ఆదివారం) ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగనుంది.

# పోరాట స్ఫూర్తిప్రదాత చాకలి ఐలమ్మ

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- శంకరపల్లి మున్సిపాలిటీలో ఐలమ్మ 131వ జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

**శంకర్ పల్లి, వెలుతురు సెప్టెంబర్ 26 :**

వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చేవెళ్ల నియోజకవర్గ శాసనసభ్యులు కాలె యాదయ్య అన్నారు. శంకరపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం వీరవనిత చాకలి ఐలమ్మ గారి 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన వీరోచిత పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. హక్కుల కోసం ఆమె సాగించిన పోరాట పటిమను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా రజక సమాజం అంతా ఐక్యతతో ముందుకు సాగాలని, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకల కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోపాలరెడ్డి, మండల మునిసిపల్ అధ్యక్షులు వెంకటరెడ్డి, చంద్రమౌళి, కౌన్సిలర్లు అశోక్, గణేష్, అఖిల యాదిరెడ్డి, గిరిజా శేకర్, లలిత మోహన్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మహమూద్, మొయిన్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకృష్ణ, రజక సంఘం ప్రతినిధులు వెంకటేష్, శంకర్, పెంటీరాజ్, మలేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, రజక సంఘం సభ్యులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసుదేవ్ కోఆపరేటివ్
# బ్యాంక్ రెండో వార్షికోత్సవం

**కూకట్ పల్లి సెప్టెంబర్ 26 వెలుతురు:**

వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంక్ రెండో వార్షికోత్సవ వేడుకలు జీడిమెట్లలోని శుభం హోటల్‌లో బ్యాంక్ చైర్మన్ రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ చైర్మన్ రామారావు కష్టపడి డిపాజిట్లను సమీకరిస్తూ, ఖాతాదారులకు అవసరమైన రుణాలను అందించడంలో, వాటి రికవరీలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలకు అధికంగా రుణాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి, తద్వారా కుటుంబాల అభివృద్ధికి బ్యాంక్ తోడ్పడటం అభినందనీయమన్నారు. కస్టమర్లతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి నమ్మకాన్ని పొందడంతో వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంక్ రెండేళ్లలోనే సుమారు 5 వేల మంది ఖాతాదారులను సంపాదించుకోవడం విశేషమన్నారు. బ్యాంక్ సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది బెస్ట్ కోఆపరేటివ్ బ్యాంక్ అవార్డును

అందించడం గర్వకారణమని తెలిపారు. వాసుదేవ్ కోఆపరేటివ్ బ్యాంక్ భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ చైర్మన్ రామారావు, బ్యాంక్ సిబ్బంది, డైరెక్టర్లు, డిపాజిటర్లు, ఖాతాదారులకు పురేందర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు, సిబ్బంది, ఖాతాదారులు, డిపాజిటర్లు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- బీజేపీ యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్..

**కూకట్ పల్లి సెప్టెంబర్ 26 వెలుతురు:**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు నరసింహ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుమార్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం

చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ, అణగారిన వర్గాల హక్కుల కోసం సాగించిన ఉద్యమం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కేశవరావు, జిల్లా నాయకులు రామరాజు, కమలాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింగ్ యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు తప్ప రఘు, నరసింహ చారి, రమేష్, సురేష్, చాంద్ పాషా, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ జన్మదిన వేడుకలు

**కూకట్ పల్లి సెప్టెంబర్ 26 వెలుతురు:**

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి జన్మదినం సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన నాయకులు ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి రామ్ తాళ్లూరిని ప్రత్యక్షంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు రామ్ తాళ్లూరితో ఆత్మీయంగా మాట్లాడి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కొల్లా శంకర్, వేముల మహేష్, శ్రీనివాస గోవిందా, ముంతాజ్, సృజనతో పాటు పలువురు కీలక నాయకులు, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

**కూకట్ పల్లి సెప్టెంబర్ 26 వెలుతురు:**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని బోయినపల్లి, మూసాపేట్ ప్రాంతాల్లో నిర్వహించిన జయంతి కార్యక్రమాల్లో బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిందని పేర్కొన్నారు. ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బండి రమేష్ పిలుపునిచ్చారు. ఆమె సేవలను, పోరాటాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, తూము వినయ్, రాజేందర్, శివ, అస్లాం, రంగమోహన్, అశోక్ కుమార్, స్వామి, రమణ, యూసఫ్, చున్ను, నయూం, సచిన్, మూసాపేట్ రజక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణతో పాటు రజక సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## హయత్నగర్ నారాయణ పాఠశాలలో
# ఘనంగా జరిగిన డెలిబరేషన్ ప్రోగ్రామ్

**హయతనగర్ వెలుతురు సెప్టెంబర్ 26:**

హయతనగర్ లోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన' డెలిబరేషన్ ప్రోగ్రామ్ " శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్తమాన అంశాలు, విద్యావిధానాలు మరియు సామాజిక బాధ్యతలపై లోతైన చర్చలు జరిపి తమ అభిప్రాయాలను సమర్థవంతంగా వ్యక్తపరిచారు. విద్యార్థులు ప్రదర్శించిన విశ్లేషణాత్మక నైపుణ్యాలు, భావవ్యక్తీకరణ మరియు క్రమశిక్షణ హజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి మాట్లాడుతూ, కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థులలో విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు మరియు బాధ్య

తాయుతమైన పౌరసత్వ విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇటు వంటి వేడుకలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని ఎంతగానో పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి పాటు G.M. గోపాలెడ్డి, ఆర్ ఎన్ డి శివరంజని, ఏ జీ ఏం రవీంద్రబాబు, సి ఓ సృజన్, ఎ.డి. మంజుల లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు కూడా అందజేసారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి సెప్టెంబర్ 26 వెలుతురు:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో చట్టబద్ధ విధులను విస్మరించారంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని, ఆయన వ్యవహారశైలిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం కావాలనే నియమించిందన్నది తమ ఆరోపణ అని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో గతంలో ఉన్న విధానానికి భిన్నంగా ప్రస్తుత వ్యవస్థలో మార్పులు జరిగాయని ఆయన విమర్శించారు. ఫారం-6లో మార్పులు, ఓటర్ల జాబితా డేటాను కేంద్రీకరించడం, డిజిటల్ వ్యవస్థల ద్వారా ఓటర్ల సమాచార నిర్వహణ వంటి అంశాలపై ఎన్నికల సంఘం పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని శ్రీరంగం డిమాండ్ చేశారు. ఓటర్ల డేటాలో ఎవరు, ఎప్పుడు, ఏ కారణంతో మార్పులు చేశారో, ఏ అధికారి అనుమతితో మార్పులు జరిగాయో తెలిపే ఆడిట్ ట్రయల్ అందుబాటులో ఉండాలని కోరారు. ఈసీఐనెట్, ఈఆర్‌నెట్ వంటి డేటాబేస్‌లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 2026 నాటికి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ డ్రాఫ్ట్ జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడినట్లు మీడియా నివేదికలు వెల్లడించాయి. అయితే, తొలగింపులకు గల కారణాలు, రాష్ట్రాలు-నియోజకవర్గాల వారీగా తొలగించిన పేర్ల సంఖ్య, అభ్యంతరాలు, తిరిగి చేర్చిన పేర్ల వివరాలను ఎన్నికల సంఘం బహిరంగపరచాలని ఆయన కోరారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని శ్రీరంగం అన్నారు. కేంద్రీకృత డిజిటల్ వ్యవస్థల్లో అధికారాల విభజన, డేటా భద్రత, పర్యవేక్షణ వంటి అంశాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లో సర్ -2026కు సంబంధించిన ఓటర్ల సేవలు, గత సర్ జాబితాలో పేర్లను శోధించే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి సార్ కు సంబంధించిన పలు అంశాలపై 14 సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికలను కూడా శ్రీరంగం ప్రస్తావించారు. ఈ అంశంపై సంబంధిత వివరాలను ప్రజలకు పూర్తిగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో, సర్ కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఎన్నికల సంఘం వర్గాలు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని శ్రీరంగం అన్నారు. తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు రక్షణకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. యువత, ముఖ్యంగా 'జెన్ జీ' యువత ఓటు హక్కు పరిరక్షణ అంశంపై చైతన్యంతో ముందుకు రావాలని, రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు ఇవ్వాలని డా.సత్యం శ్రీరంగం పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు' లభించిన సందర్భంగా డా.సత్యం శ్రీరంగం శుభాకాంక్షలు తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై తమ నిరసనలో భాగంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## హయత్ నగర్ నారాయణ స్కూల్ లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

**హయత్ నగర్ వెలుతురు సెప్టెంబర్ 26:**

హయత్ నగర్ పరిధిలోని నారాయణ ఇ-ఛాంప్స్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకను ఏజీఎం రవీంద్రబాబు , ప్రిన్సిపల్ మానస , కో-ఆర్డినేటర్ దివ్య , వైస్ ప్రిన్సిపల్ కవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పాఠశాలకు విచ్చేసిన తాత య్యలు, అమ్మమ్మలు, నానమ్మలకు విద్యార్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, ఆకట్టుకునే ప్రసంగాలతో తాత, నానమ్మల పై ఉన్న ప్రేమను చాటుకున్నారు. అనంతరం తాతయ్యలకు, అమ్మమ్మలకు నిర్వహించిన ఆటల పోటీల్లో వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. మనవళ్ళు, మనవరాళ్లతో గడిపిన ఈ క్షణాలను ఎప్పటికీ

మరచిపోలేమని తాతయ్యలు, అమ్మమ్మలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు

## ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న జీడిమెట్ల రవీందర్‌కు ఘన సన్మానం

**నల్లగొండ వెలుతురు సెప్టెంబర్ 26:**

ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నల్లగొండ శనివారం జరిగిన సదస్సులో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి. హిమ బిందు చేతుల మీదుగా పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో పర్యావరణ చైతన్యం కోసం కృషి చేస్తున్న ఇండియన్ ఎన్విరాన్‌మెంట్ సోషల్ ఫోరం (IESF) వ్యవస్థాపక అధ్యక్షులు జీడిమెట్ల రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవీందర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న సేవలను ప్రశంసించారు. జీడిమెట్ల రవీందర్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చెట్ల పెంపకం, నీటి వనరుల సంరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రకృతి పరిరక్షణే.. ఆరోగ్య రక్షణ. పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును

అందించగలం" అని రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ సమన్వయకర్త చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ వ్యవస్థాపక చైర్మన్ శ్యామల నాగసేనారెడ్డి, వై అశోక్ రెడ్డి ఆర్డీఓ నల్లగొండ నల్లగొండ జిల్లా సంక్షేమ అధికారి లావణ్య కుమారి, సిడిపిఓ చంద్రకళ, పాల్ రెడ్డి ఫౌండేషన్ పల్ రెడ్డి రామ్ రెడ్డి, కట్కూరి విష్ణు రెడ్డి నవ యువ ఫౌండేషన్ చైర్మన్ వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి: చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 26:**

రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ అన్నారు. శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ రోడ్డు రైతు వేదిక వద్ద ఒకటవ వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్, వైస్ చైర్మన్ పర్నే శివారెడ్డి, డైరెక్టర్ సురుకంటి లక్ష్మమ్మ యాదిరెడ్డి ని శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం వారి ఆర్థిక పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో రైతుల సంక్షేమం, అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించడమే తమ సంఘం ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. చౌటుప్పల్ మండలంలోని గ్రామాలను పిలాయిపపల్లి కాలువతో సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తా అన్నారు. . పిల్లాయిపల్లి కాలువకు మరమ్మత్తులు చేయించి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని

తెలిపారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టి భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మమ్మల్ని ఘనంగా సన్మానించిన కౌన్సిలర్ కోసనం రాకేష్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్,మాజీ కౌన్సిలర్ కొరగోని లింగస్వామి, బండమీది మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊదరి నరసింహ, దోనకొండ కృష్ణ, నల్ల గణేష్ యాదవ్, ఉడత నరసింహ, బోరెం శేఖర్ రెడ్డి, మారుపాకల స్వామి, మట్టపల్లి శ్రీశైలం,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## వెంకపల్లిలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీ ప్రారంభం

**నూతనకల్ వెలుతురు సెప్టెంబర్ 26:**

SGF తుంగతుర్తి నియోజకవర్గస్థాయి కబడ్డీ టోర్నమెంట్–2026 గేమ్స్ ను ప్రారంభించిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి గారు, PACS చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి గార్లు, మండల విద్యాధికారి రాములు నాయక్, వెంకేపల్లి సర్పంచ్ ఇమ్మడి జయ కుమార్ SGF కబడ్డీ టోర్నమెంట్ అండర్ 14, అండర్ 17 గేమ్స్ ను వెంకేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించడం జరిగింది .వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో నైపుణ్యం పొందాలని, విద్యార్థులందరూ క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో

MEO రాములు నాయక్, శివయ్య,PET లు కల్పన, సమత, ఉపేందర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పాల్వాయి నాగయ్య, తోనుకునూరి సైదులు, పవన్ రెడ్డి,నాగార్జున, కార్తీక్,వార్డు మెంబెర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు

## మల్కాపురం ప్రభుత్వ మిగులు భూమిని నిరుపేదలకు పంచాలి

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 26:**

చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 617, 114లో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని మల్కాపురం గ్రామంలోని నిరుపేద ప్రజలకు పంపిణీ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి. జాంగిర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రోజున జరిగిన సిపిఎం చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎం.డి. జాంగిర్ హాజరై మాట్లాడుతూ, మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని గుర్తించి, భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని అన్నారు. గ్రామంలో భూమిలేని పేదలు అనేకమంది ఉన్నారని, వారికి జీవనాధారం కల్పించేందుకు ప్రభుత్వ మిగులు భూమిని పంపిణీ చేయడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, భూమి పంపిణీ ప్రక్రియను చేపట్టి అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హాజరైన నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు బూరుగు కృష్ణారెడ్డి మండల కార్యదర్శి గంగాదేవి సైదులు మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతల సుదర్శన్ తడక మోహన్ మండల కమిటీ

సభ్యులు ఆదిమూలం నందీశ్వర్ పొట్ట శ్రీనివాస్ అంతటి అశోక్ మీసాల శీను కొంతం సుశీల చెరుకు లక్ష్మమ్మ కొండే శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**మునుగోడు,సెప్టెంబర్ 26 (వెలుతురు ):**

మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో చాకలి ఐలమ్మ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చేసిన పోరాటాన్ని, ధైర్యసాహసాలను వక్తలు కొనియాడారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బాతరాజు సత్తయ్య, మారగోని అంజయ్య గౌడ్,మిర్యాల వెంకటేశ్వర్లు,రేవెల్లి అంజయ్య,సత్తయ్య,

ముచ్చపోతుల నరసింహ,రేవెల్లి స్వామి,అక్కెనపల్లి సతీష్,దుబ్బ వెంకన్న, పలువురు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు,స్థానికులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**మోత్కూర్, సెప్టెంబర్ 26,వెలుతురు న్యూస్ :**

మోత్కూర్ పట్టణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నాడు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను మోత్కూర్ దోబిగాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం నాటి దేశముఖ్ విసునూర్ దొర ను ఎదిరించిన ధైర్యశాలి ఐలమ్మ అని,వీరి పోరాటం తెలంగాణ విముక్తి కి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి మైసయ్య, కూసంపెల్లి సోమనరసయ్య, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కూసంపెల్లి ఉప్పలయ్య, బొడ్డుపల్లి లక్ష్మయ్య, కూసంపెల్లి కృష్ణ, బొడ్డుపెల్లి బాలమ్మ, కూసంపెల్లి లక్ష్మి, బొడ్డుపల్లి రాములమ్మ, కూసంపెల్లి అంజమ్మ, బొడ్డుపల్లి భాగ్యలక్ష్మి, బొడ్డుపల్లి లక్ష్మి, కూసంపల్లి ఆంజనేయులు, పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తి తెలంగాణ సమాజానికి ఆదర్శం

**మోత్కూరు, సెప్టెంబర్ 26, వెలుతురు :**

భూస్వాములకు, పెత్తందారులకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం పోరు బాట సాగించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి చాకలి ఐలమ్మ నాటి పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శనీయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి అన్నారు.శనివారం ఆమె 131 వ, జయంతి పురస్కరించుకొని స్థానిక శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల కోసం నిరంతరం మరి పంపించిన ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల నాయకులు చేతరాశి వెంకన్న,, తీగల నర్సింహ్మా బోడ పెద్ద సోమ నర్సయ్య, మల్లేశం, శ్రీను,పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకం

**మునుగోడు, సెప్టెంబర్ 26 (వెలుతురు ):**

గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకమని సర్పంచ్ జిట్టగోని సైదమ్మ–సైదులు అన్నారు. శనివారం మండల పరిధిలోని రత్తిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు,ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతుల కు ఉపయోగపడే వీబీజీ రాంజీ పథకం వివరాలను తెలియజేసి,అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని

సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు,కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్,ఫీల్డ్ అసిస్టెంట్, వీఏఓ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యానికి పోషకాహారం కీలకం

**మునుగోడు,సెప్టెంబర్ 26 (వెలుతురు ):**

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని సర్పంచ్ దాసరి గోవర్ధన్ అన్నారు.శనివారం మండల పరిధిలోని బీరెల్లిగూడెం అంగన్ వాడి కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందించడంపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మిర్యాల నాగమణి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల భాగస్వామ్యంతో పాటలు,చిత్రలేఖనం, పాత్రధారణ, పద్యాలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈసీసీఈడీని ప్రోత్సహించాలని తెలిపారు.

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దోటి వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు దాసరి మహారాజు,దాసరి రమ్య రాంబాబు,గ్రామ కార్యదర్శి సీహెచ్ వెంకన్న,అంగన్వాడీ టీచర్ కే.నిర్మల, ఆయా, గర్భిణులు, బాలింతలు,పిల్లల తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘంలో 33 వార్షిక మహాసభ కార్యక్రమం

**గుండాల సెప్టెంబర్ 26,(వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో చేనేత సహకార సంఘం 33వ వార్షిక మహాసభను సంఘం అధ్యక్షులు చిందం ప్రకాష్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడిఏ సచిన్ పాల్గొని మాట్లాడుతూ గుండాల చేనేత సహకార సంఘాన్ని అభివృద్ధి పథం లోకి తీసుకు వెళ్తానని అన్నారు . సంఘం అకౌంటెంట్ దుడక సత్యనారాయణ సంఘం యొక్క 2026 సంవత్సరానికి సంబంధించిన లావాదేవీలను చదివి సంఘ పాలకవర్గానికి , సభ్యులకు చదివి వినిపించారు. 2026 2027 సంబంధించిన అంచనా బడ్జెట్ను కూడా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచ్

దేవరబోయిన ఐలయ్య, మాజీ ఉపాధ్యక్షుడు దుడుక్క ఉప్పలయ్య, మోత్కూరు అధ్యక్షుడు వంగూరి బుగ్గ రాములు, మాజీ మేనేజర్ శ్రీపతి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఏలే కృష్ణ , సంఘ పాలకవర్గం సభ్యులు గోలి రమేష్, తాటి వెంకటేశం, దుడుక లింగమూర్తి, బిట్ల ఆనంద్, బొల్లం లలిత, ప్రొడక్షన్ ఇంచార్జి దోర్నం రమేష్, దోర్నం గోపాల్, కుల సభ్యులు పాల్గొన్నారు.

## మహిళల కుంకుమార్చన

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 26:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ లోని వినాయక ఉత్సవ సమితి మహిళ విభాగం ఆధ్వర్యంలో కుంకుమ అర్చన ఘనంగా నిర్వహించారు. స్థానిక తంగడపల్లి రోడ్డు లోని నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేశ్ ఉత్సవాల్లో భాగంగా మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళ సభ్యులందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామి వారిని పూజించి పట్టణ ప్రజలందరూ సుఖ,సంతోషాలతో ఉండాలని కోరామని తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళాలు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు, సీసీ కెమెరాలు ప్రారంభోత్సవం

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 26:**

చౌటుప్పల్ మున్సిపల్ లక్కారం 8 వ వార్డు లో గ్రామ కచ్చిరు దగ్గర గ్రౌండ్ ను సిమెంటు రోడ్డు గా మార్చుటకు చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. 8వ వార్డు పరిధిలో సిసి కెమెరాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్ర సేన రెడ్డి, యాదాద్రి జిల్లా ఫిషరిష్ చైర్మన్ పాశం సంజయ్ బాబు ,చౌటుప్పల్ ఎస్సై అజయ్ భార్గవ్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బద్రి గాలయ్య, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, మాజీ సర్పంచ్ కానుగు బాలరాజు, సీసీ కెమెరాల దాత పాశం కృష్ణయ్య, పాల్గొన్నారు.

# 28న కరీంనగర్‌లో 'శాతవాహన గ్రామీణ సంత' వాల్ పోస్టర్ ఆవిష్కరణ...

- పోస్టర్ ను ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్...

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 26:**

పర్యావరణ పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఈనెల 28న కరీంనగర్లో గ్రామ భారతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న "శాతవాహన గ్రామీణ సంత" వాల్ పోస్టర్‌ను శనివారం రోజున మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆవిష్కరించారు.విష రహిత ఆహార ఉత్పత్తిదారులు, చేతివృత్తుల వారు , వినియోగదారులకు పరస్పర తోడ్పాటును అందించే ఏకైక లక్ష్యంతో ఈ సంతను నిర్వహిస్తున్నట్టు గ్రామ భారతి బాధ్యులు తెలిపారు. సెప్టెంబర్ 28 సోమవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్లో ఈ సంత జరుగుతుందని తెలిపారు. మొత్తం 60 స్టాల్స్‌తో, అంచనాగా 1200 మంది వినియోగదారుల భాగస్వామ్యంతో ఈ సంత జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఇ. వెంకటేశ్వర్లు, ఎ.ఇ. సతీష్‌తో పాటు శాతవాహన గ్రామీణ సంత రాష్ట్ర, జిల్లా కార్యకర్తలు జిన్నా సత్యనారాయణ రెడ్డి, రఘురాం రెడ్డి, నాల్యా మడుగుల శంకరయ్య, గాలిపెల్లి నాగేశ్వరరావు, కూర్మాచలం మునీందర్, గొల్లె తిరుపతి, క్యాస మధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఇంటి పైకప్పుపై పాము కలకలం

- లింరా కాలనీలో ఘటన.. పారిశుధ్య లోపాలపై స్థానికుల ఆందోళన

**జహీరాబాద్ వెలుతురు, సెప్టెంబర్ 26:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని లింరా కాలనీలో ఓ ఇంటి పైకప్పుపై పాము కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. కాలనీవాసి మహమ్మద్ అహ్మద్ ఇంటి పైకప్పుపై పాము సంచరిస్తుండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో వారు అప్రమత్తమై పాముకు దూరంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంటి పైకప్పుపై పాము కనిపించిన విషయం స్థానికులకు తెలియడంతో కొందరు యువకులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం పామును కొట్టి చంపడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊరట చెందారు.

**పారిశుధ్య లోపాలపై ఆందోళన:**

ఇదిలా ఉండగా, లింరా కాలనీ పరిసరాల్లో ఖాళీగా మురుగు కాలువలు, మురుగునీటి నిల్వలు, దట్టంగా పెరిగిన

పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పారిశుధ్య పరిస్థితులు లేకపోవడం వల్ల పాములు, ఇతర విషపు రుగులు ఇళ్ల సమీపానికి అవకాశం ఉంద ని స్థాని కులు పేర్కొంటున్నారు. వర్షాకా లంలో మురుగు కాలువలు పొంగిపొర్ల దం, పరిసరాల్లో నీరు నిలిచి పోవడం, పిచ్చి మొక్కలు పెరగడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతు న్నారు. ముఖ్యంగా ఇళ్లకు సమీపంలో చెత్తాచె దారం పేరుకుపోవడంతో విషపు రుగులు, పాములు సంచరించే పరిస్థితులు ఏర్పడుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్:**

లింరా కాలనీలో మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు, దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇళ్ల పరిసరాల్లో పాము కనిపించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పామును స్వయంగా పట్టుకో వడానికి లేదా చంపేందుకు ప్రయత్నించ కుండా శిక్షణ పొందిన స్నేక్ రెస్క్యూ సిబ్బంది లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

## జహీరాబాద్‌లో రికార్డు
# స్థాయి ధర పలికిన వినాయక లడ్డూ

- రూ.4.51 లక్షలకు లడ్డూను దక్కించుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్ దంపతులు...
- జహీరాబాద్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన బంజారా భవన్ లడ్డూ వేలం...

**జహీరాబాద్ వెలుతురు, సెప్టెంబర్ 26:**

జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న బంజారా భవన్‌లో వినాయక లడ్డూ వేలం రికార్డు స్థాయిలో ధర పలికింది. సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొలిసారిగా బంజారా భవన్‌లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిరోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనానికి ముందు నిర్వాహకులు లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను దక్కించుకునేందుకు పలువురు భక్తులు పోటీ పడగా, చివరకు స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) సుభాష్ రాథోడ్, డాక్టర్ శశిరేఖ దంపతులు రూ.4 లక్ష 51 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ ధర జహీరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన వినాయక లడ్డూ వేలంలో రికార్డు స్థాయిగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. వేలంలో లడ్డూను దక్కించుకున్న సుభాష్ రాథో

డ్ కుటుంబ సభ్యులను ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేలంలో దక్కించుకున్న లడ్డూను వారికి అందజేశారు. ఈ సందర్భంగా సుభాష్ రాథోడ్ మాట్లాడుతూ.. వినాయకుడి దివ్య ఆశీస్సులతో లోకకల్యాణం జరగాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో లాభాల బాట పట్టాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బంజారా సమాజం బాధ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# రూ.2.58 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- జహీరాబాద్‌లో మౌలిక వసతులకు కొత్త ఊపు...
- పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన...

**జహీరాబాద్ వెలుతురు, సెప్టెంబర్ 25:**

జహీరాబాద్ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.2.58 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ టౌన్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా వార్డులు 3, 6, 12, 15, 16, 17, 22, 27, 28, 33లో ఈ పనులను చేపట్టనున్నారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. ఏ. చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి కలిసి ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే స్థానికులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. అలాగే సీసీ డ్రైన్ల నిర్మాణంతో వర్షాకాలంలో రోడ్లపై మురుగునీరు నిలిచిపోకుండా పారుదల వ్యవస్థ మెరుగుపడే అవకాశం ఉంది. దీంతో ఆయా ప్రాంతా ల్లో పారిశుధ్య సమస్యలకు కొంతమేర పరిష్కారం లభించనుంది. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక వసతులు పట్టణ అభివృద్ధిలో కీలకమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమా ణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

**ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి:**

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. రూ.2.58 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే ఆయా వార్డుల్లో రహదారి

సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు మురుగునీటి పారుదల వ్యవస్థ బలోపేతం కానుంది. దీంతో ప్రజలకు రాకపోకలు, పారిశుద్ధ్యం పరంగా ప్రయోజనం కలగనుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, సీడీసీ చైర్మన్ ముబీన్, జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండెం నరసింహులు, మున్సిపల్ డీఈ మహేష్, ఏఈ వెంకటేష్, ఖాజా, కౌన్సిలర్లు జహంగీర్, రంగా అరుణ్ కుమార్, జాని భాయ్, శ్రీధర్ రెడ్డి, జమీలుద్దీన్, అక్రమ్, నిజాముద్దీన్, అతిక్ హక్కాని, జావీద్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శుక్లవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

- హద్నూర్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించిన బీజేపీ నాయకులు...

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం హద్నూర్ గ్రామంలో ఘనంగా నివాళులర్పించారు. గ్రామస్తులతో కలిసి బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్ మోడీ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ గంగ్వార్ మోడీ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ అన్యాయానికి, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప వీరనారి అని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవం, ధైర్యం నేటి తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలను, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆమె ఆశయాలను భావితరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో హద్నూర్ గ్రామస్తులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీగా సయ్యద్ షఫీ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 26:**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీగా సయ్యద్ షఫీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సయ్యద్ షఫీ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతన్న సయ్యద్ షఫీ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బుయ్యని శివ, కుత్బుల్లాపూర్ మైనారిటీ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ ఖైమ్ పాషా, డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్దర్థ్ సంజీవ్ రెడ్డి, జలీల్ ఖాన్, డివిజన్ మైనారిటీ అధ్యక్షులు ఎం.డి. షకీల్, ఎం.డి. ఫెరోజ్, షేక్ షరీఫ్, గౌస్ భాయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్యామ్, హన్మి రెడ్డి మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వీరనారి
# చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

- పాల్గొన్న జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్

**కొడిపల్లి వెలుతురు సెప్టెంబర్ 26:**

మండల కేంద్రంలోని పంచాయితీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ గారి చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ చంద్రం కృష్ణా గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో సబ్బండ వర్గాల ప్రజల ఆత్మగౌరవం కోసం, భూమి కోసం, అన్యాయానికి ఎదురు నిలిచి పోరాడిన ధైర్యశాలి, అమర వీరనారి మన చాకలి ఐలమ్మ అని గుర్తు చేశారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేత మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు రెడ్డి మాధవి మహేష్, గౌడ చర్ల ప్రశాంత్, లక్ష్మీ శరత్ కుమార్, మక్బూల్, బొంతమ్మ సంగప్ప, మంగలపర్తి సందీప్ కుమార్, మురళి, దేవేందర్, పంచాయతీ కార్యదర్శి నాగేష్, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

- రంజోల్‌లో ఘనంగా 131వ జయంతి వేడుకలు...
- భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి ఎదురు నిలిచిన ధీరవనిత ఐలమ్మ...
- సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆశయాలను కొనసాగించాలి...

**జహీరాబాద్ వెలుతురు, సెప్టెంబర్ 26:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని రంజోల్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) అధ్యక్షుడు, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్దు రావణ్ ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్దు రావణ్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన వీరనారి అని అన్నారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి ఆమె ధైర్యంగా ఎదురు నిలిచారని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. అన్యాయాన్ని ఎదుర్కొన్నప్పుడు వెనుకడుగు వేయకుండా హక్కుల కోసం పోరాడిన ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. యువత చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను తెలుసుకోవడంతో పాటు ఆమె పోరాట స్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులు, గౌరవం కోసం ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షుడు అలీమ్ హుస్సేన్, నాయకులు రాములు, విజయ్ కుమార్, ఆగమయ్య, బలరాం, బాల్రాజ్, రజక సంఘం నియోజకవర్గ నాయకులు వెంకటేశం, పెంటన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం ఆమె సేవలు, పోరాటాలను స్మరించుకున్నారు. ఐలమ్మ ఆశయాలను ప్రతి గ్రామానికి, ప్రతి తరానికి చేరేలా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# పోలంపల్లిలో ఘనంగా 'పోషణ్ మహా' కార్యక్రమం.. హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి

**తిమ్మాపూర్, వెలుతురు సెప్టెంబర్ 26:**

తిమ్మాపూర్ మండలం పోలంపల్లి అంగన్వాడి కేంద్రంలో 'పోషణ్ మాస్' ప్రోగ్రాంలో భాగంగా ప్రత్యేకంగా పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ ఈ సంవత్సరం సెప్టెంబర్ 9 వ తేదీ నుండి అక్టోబర్ 8 వ తేదీ వరకు పోషణ్ మాస్ కార్యక్రమాలను ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. "మన అంగన్వాడి – మన బాధ్యత" అనే భావనతో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరైన పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. కేవలం పౌష్టికాహారమే కాకుండా, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, పోలంపల్లి గ్రామ

సర్పంచ్ లావణ్య, నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ రవీందర్, సిడిపిఓ శ్రీలత, డాక్టర్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్ పద్మ, హైస్కూల్ హెచ్ఎం, ఉప సర్పంచ్, పోషణ్ అభియాన్ డిసి ప్రమీల, బీసీ ప్రణీత, సఖి కవిత, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పిల్లలు, కిశోర బాలికలు తల్లులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 26:**

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని సందర్భంగా గాజులరామారం డివిజన్ గాజుల రామారం చౌరస్తాలో కుత్బుల్లాపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ అని, వారి ఆశయాల సాధనకై అందరం పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ రజక సంఘం అధ్యక్షుడు జలిగం రాకేష్, ప్రెసిడెంట్ చింత స్వామి, ప్రధాన కార్యదర్శి సింగారం మల్లేష్, ఉపాధ్యక్షులు మురళి, సభ్యులు సత్యనారాయణ, యాదగిరి, రాజు, చందు, నరేష్, వెంకటేష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూడిమెట్ల సోమేష్ యాదవ్, శ్రీ వెంక టేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, అడ్వకేట్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ధిక్కార స్వరానికి మారుపేరు చాకలి ఐలమ్మ ఆమె స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రిగా చేయాలి

- చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

వెట్టి చాకిరి,బానిస బతుకులకు వ్యతిరేకంగా రజాకార్ల మరియు విస్నూర్ దేశ్ ముఖుల ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొని పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చూపిన తెగువ భావితరాలకు ఆదర్శమన్నారు.ఆ రోజుల్లో ఖాసీం రజ్వీ నాయకత్వంలో దొరలు, విస్నూర్ దేశ్ ముఖులు చేసే ఆగడాలకు అంత లేకుండా పోయిందని పేద ప్రజల ధన మానప్రాణాలను దోచుకుంటూ దుర్మార్గంగా వ్యవహరించే వారిని దొరల చేస్తున్న దాష్టీకానికి ఎదురు తిరిగి నిలబడి పోరాడిన గొప్ప యోధురాలు చాకలి ఐలమ్మ అని ఆమెను స్ఫూర్తిగా తీసుకొని బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమించి తెలంగాణ రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రిగా చేయాలని సామాజిక తెలంగాణ సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నామా సైదులు, గోదా రవి శ్రీనివాస్ ముదిరాజ్ ఉన్నారు.

# ఎలిమినేడు గ్రామంలో భక్తిశ్రద్ధలతో గణనాధునికి పూజలు చేసిన

- వక్తలు ఆర్ వాయిస్ జర్నలిస్ట్ నవిత బుస్సు శ్రీకాంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు సెప్టెంబర్ 26:**

ఇబ్రహీంపట్నం మండల ఎలిమినేడు గ్రామంలో శంబాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాధునికి శనివారం వక్తలు ఆర్ వాయిస్ జర్నలిస్ట్ నవిత ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూభక్తిశ్రద్ధలతో గణనాధునికి పూజలు ఆటపాటలు కోలాటలు ఆడుతూ భజన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా వర్షాలు బాగా పడి పంటలు పండాలని ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అన్నారు అలాగే శివాజీ మహారాజ్ శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర వారి ధైర్యసహసాలు ప్రజా సంక్షణం కోసం చేసిన కృషి గురించి వివరించడం జరిగింది. అలాగే హిందూ ధర్మం మన సంప్రదాయాలు సంస్కృతి ఆచారాల ప్రాముఖ్యత ను వివరం గా తెలియజేయడం జరిగింది. మన చరిత్రను సాంస్కృతిని సంప్రదాయాలను తెలుసుకొనికు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో యూత్ సభ్యులు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

# భాజపా కార్మిక విభాగం జిల్లా కో కన్వీనర్ గా రాజశేఖర్ రెడ్డి

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 26:**

భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం జిల్లా కో కన్వీనర్ గా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన మునగాల రాజశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ అందే శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ ఐతరాజు సిద్దు ఆయనకు హైదరాబాదులోని కార్యాలయంలో ఈ నియామక పత్రాన్ని అందజేశారు. భాజపా సిద్ధాంతాలు, ఆచరణ, క్రమశిక్షణను గుర్తించి ఈ పదవిలో నియమించినట్టు వారు ప్రకటించారు.

# మంచాలలో రజకసంఘం మండల అధ్యక్షుడు లొంగరి మల్లేష్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ131వ జయంతి వేడుకలు

- తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అడుగుజాడల్లో నడవాలి
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 26:**

మంచాల మండలం మండల తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జ యంతి వేడుకల సందర్భంగా మంచాల మండలం రజక సంఘం అధ్యక్షుడు లొంగరి మల్లేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చెరువు కట్టపైన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవే సి నివాళులర్పించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మం చాల మండలం వైయస్సార్ యువసేన నాయకుడు లొంగరి యాదగిరి ఈ సందర్భంగా వైయ స్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ ఆనాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటలో రజాకార్లకు ఎదురొడ్డి పోరాటం చేసిన గొప్ప పోరాట యోధురాలు తెలంగాణ వీరనారి చాకలిఐలమ్మ అని అన్నారు పేదల బలహీన బడుగు వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహ నీయురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు సామాజిక న్యాయం ఆత్మగౌరవం సమానత్వం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటంనేటి తరానికి ఆదర్శం అని అన్నారు భూమి భుక్తి కోసంజీవ న హక్కుల కోసం ఆమెచేసిన పోరాటం అణగారిన వర్గాల్లో హక్కులపట్ల ఆమె చైతన్యాన్ని పెంచింది అని అన్నారు ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన నేను ఉన్నాను అంటూ అండగా నిల బడి దొరల గడీలు కులగొట్టి వందలాది ఎకరాల భూములు పేద ప్రజలకు పంచిన గొప్ప పోరాట యోధురాలు చాకలిఐలమ్మ అని గుర్తుచేశారు ప్రతి తెలంగాణ పౌరుడు చాకలి ఐలమ్మ పో రాటాన్ని సేవలను ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో నడిచి చాకలిఐలమ్మఆశయసాధన కోసం కృషి చేయాలని అనిఅన్నారు ఈకార్యక్రమంలో మంచాల మండలం రజక సంఘం ఉ పాధ్యక్షులు మొగిలి శ్రీశైలం మరియు రజక సంఘం రాష్ట్ర నాయకులు అవతాపురంశ్రీరాములు మంచాల మం డలం గౌరవ అధ్యక్షులు గాలయ్య మంచాల గ్రామశాఖ రజకసంఘం అధ్యక్షులు వడ్లకొండ యాదయ్య మరియు రజకసంఘం నాయకులు మొగిలి గిరిబాబు మొగిలి మహేష్ జ పాల బుగ్గరాములు అన్నారం యాదయ్య లక్షణాలు నారాయణ అన్నారం యాదయ్యమంచాల గ్రామం వార్డ్ సభ్యుడు మాల్గ శ్రీశైలం గ్యారశేఖర్.మంచాల మండలం నాయిని బ్రహ్మ అధ్యక్షుడు అశ్వల బాలరాజ్ మల్ల లింగం గడ్డం ప్రభాకర్ గడ్డం రాజు కడారి లింగం ఏర్పుల నరేష్ మాచర్ల అబ్బయ్య వివిధ పార్టీల నాయకులు రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ముగిసిన మూడు రోజుల జాతీయ సదస్సు

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

పల్లవి ఇంజినీరింగ్ కళాశాల (యూజీసీ స్వయం ప్రతిపత్తి)లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలోని భారతీయ భాషల అభివృద్ధి, ప్రోత్సాహ కార్యక్రమం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24 నుంచి 26 వరకు మూడు రోజుల జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించారు. "అత్యాధునిక గణన సాంకేతికతలు – సూపర్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్ – వికసిత భారత్ 2026కు చోదకశక్తి" అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విశిష్ట వక్తలు పాల్గొని విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విలువైన అవగాహన కల్పించారు. డాక్టర్ ఎం.డి. మహబూబ్ బాషా, డాక్టర్ ఎస్.ఐ. ఖాన్, డాక్టర్ షేక్ ఫిరోజ్, డాక్టర్ ఎ. సాయి హరీష్, డాక్టర్ బుడాటి అనిల్ కుమార్, డాక్టర్ అశోక్ జి. మతాని తదితర నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగించారు. కృత్రిమ మేధస్సు, సూపర్ కంప్యూటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వాటి వివిధ రంగాల్లోని అనువర్తనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం పల్లవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్ డాక్టర్ జె.బి.వి. సుబ్రహ్మణ్యం మార్గదర్శకత్వంలో కళాశాల యాజమాన్యం, ప్రముఖుల సహకారంతో నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ , విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్ సహ సమన్వయకర్తగా వ్యవహరించగా, అధ్యాపకులు , విద్యార్థి సమన్వయకర్తలు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.మూడు రోజుల సదస్సు విద్యార్థులు, అధ్యాపకులు విద్యా రంగం, పరిశ్రమలకు చెందిన నిపుణులతో నేరుగా మమేకమై అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విలువైన జ్ఞానం, అవగాహన పొందారు. సెప్టెంబర్ 26న సదస్సు ఘనంగా ముగి సింది. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను విద్యార్థు లు, అధ్యాపకులు, ప్రముఖ అతిథులు అభినందించారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకం

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు సెప్టెంబర్ 26:**

శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం బలోపేతమైందని, తద్వారా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంపిణీ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. 1895లో జన్మించి 1985లో మరణించిన వీరనారి చాకలి ఐలమ్మ తన జీవితంలో అనేక కష్టాలను, అణచివేతలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాడారని తెలిపారు. పాలకుర్తి ప్రాంతంలో కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేస్తూ, తన పంటను దోపిడీ చేసేందుకు ప్రయత్నించిన దొరల ఎదుట ధైర్యంగా నిలబడి తన హక్కుల కోసం పోరాడిన వీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మాత్రమే కాకుండా, నేటి తరానికి దిక్సూచిగా నిలిచిన స్ఫూర్తిదాత అని మల్లేష్ యాదవ్ కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తితో యువత తప్పుడు మార్గాలకు దూరంగా ఉండి, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజ య్, దశరథ్, శ్రీరాములు, వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు అచ్చన నరసింహ, పర్వతాలు పాల్గొన్నారు.

# మార్తాండనగర్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

**కొండాపూర్ వెలుతురు సెప్టెంబర్ 26:**

కొండాపూర్ మార్తాండనగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నిన్న నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని కాలనీ కమిటీ సభ్యులు ఎంతో చక్కగా ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించారు.నిమజ్జన కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు మహిళలు, యువత, చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా కాలనీ వాసులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. అబ్బాయిలు, అమ్మాయిలు, మహిళలు, పిల్లలు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై నిమజ్జనాన్ని ఎంతో గ్రాండ్‌గా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలం పాటలో ఒక లడ్డూ రూ.96 వేల ధర పలికింది. అలాగే కలశం రూ.1.70 లక్షలకు వేలంలో దక్కింది. వేలం పాటలో కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం మరింత సందడిగా సాగింది.కమిటీ సభ్యుల సమన్వయం, కాలనీ వాసుల సహకారంతో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అందరూ ఒక్కటై వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. భక్తి, ఆనందం, ఐక్యతతో సాగిన ఈ నిమజ్జన కార్యక్రమం కాలనీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గణపయ్య బప్పా మోరియా... వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా అంటూ కాలనీ వాసులు గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# మసకబారుతున్న జీవితాలకు నాణ్యమైన చూపునందిస్తున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దంపతులు

- 16 ఉచిత కంటి వైద్య శిబిరాలు, 12306 మందికి కంటి పరీక్షలు, 2673 మందికి కంటి ఆపరేషన్లు, 5522 మందికి కండ్లజోళ్ల పంపిణీ
- ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా నిరుపేద వృద్ధుల కండ్లలో వెలుగులు నింపుతున్నకోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్
- నేడే (27-09-2026, ఆదివారం) నారాయణ్ పూర్ మండల కేంద్రంలో 17 వ ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహణ

**మునుగోడు వెలుతురు సెప్టెంబర్ 26:**

మునుగోడు నియోజకవర్గంలో కంటి విప్లవం కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యలతో బాధపడొద్దని, ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చేయించి నాణ్యమైన చూపును అందించాలనే ముందుచూపుతో తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు..ఇప్పటివరకు 16 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 12306 మందికి కంటి పరీక్షలు చేయించి 2673 మందికి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి,,5522 మందికి కండ్లజోళ్ల పంపిణీ చేశారు. మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, 2వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన 3వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన 4వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన 5వ, విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చూండురు మండల ప్రజలకు చండూరు మండలం బంగారి గడ్డలో నిర్వహించిన 6వ, విడత వైద్యశిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో ఘట్టుప్పల్ మండల ప్రజలకు నిర్వహించిన 7వ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండలంలో నిర్వహించిన 8 వ, విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన 9వ, విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన 10వ, విడత వైద్య శిబిరంలో 160 మందికి, మునుగోడు లో మునుగోడు, ఘట్టుప్పల్ మండలాల ప్రజలకు నిర్వహించిన 11వ, విడత వైద్య శిబిరంలో 257 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయం ఆవరణలో చూండరు మున్సిపాలిటీ చండూరు మండల ప్రజలకు నిర్వహించిన 12 వ, విడత వైద్య శిబిరంలో 223 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో నాంపల్లి మండల ప్రజలకు నిర్వహించిన 13 వ, వైద్య శిబిరంలో 228 మందికి, మరి గూడ మండల కేంద్రంలో మర్రిగూడ మండల ప్రజలకు నిర్వహించిన 14వ విడత వైద్య శిబిరంలో 127 మందికి, చౌటుప్పల్ లో చౌటుప్పల్ మండల, పట్టణ ప్రజలకు నిర్వహించిన 15 విడత వైద్య శిబిరంలో 165 మందికి, మునుగోడు లో నిర్వహించిన 16 వ, విడత వైద్య శిబిరంలో 183 మందికి కంటి ఆపరేషన్లను పూర్తి చేశారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు... రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు..

# మల్కాజ్‌గిరి కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డికి వినతిపత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 26:**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, ఘట్కేసర్ సర్కిల్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ శనివారం మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.బోడుప్పల్, ఘట్కేసర్ సర్కిళ్ల పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, రహదారులు, డ్రైనేజీ, పార్కులు, పారిశుధ్యం, ఓపెన్ జిమ్‌లు తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేయాలని ఆయన కమిషనర్‌ను కోరారు.ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు కేటాయించాలని వజ్రేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని వజ్రేష్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామల అమర్, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, మాజీ చైర్మన్ మల్లి పావని జంగయ్య యాదవ్, విశ్వనాథం, ఉదయ్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.

# మంచాల మండల కేంద్రంలో రజక సంఘం మండలం కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

- చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం పనిచేయాలి
- కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 26:**

మంచాల మండలం తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మం చాల మండల కేంద్రంలో మంచాల మండలం రజక సంఘం అధ్యక్షుడు లొంగరి మల్లేష్ ఆ ధ్వర్యంలో మంచాల చెరువు కట్టపైన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ రజాకారులతోఎ న్నో పోరాటాలు చేసి ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగిన అక్కడ ప్రజలకు అండగా ఉంటూ పోరాటం చేసిన గొప్ప వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు ప్రతిఒక్కరు చాకలి ఐలమ్మ ఆశ య సాధన కోసం కృషి

చేయాలి అన్నారు ఈకార్యక్రమంలోమంచాల మండల రజక సంఘం అ ధ్యక్షులు లొంగరి మల్లేష్ మంచాల గ్రామసర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఉపసర్పంచ్ పందు గుల లింగం గౌడ్ మంచాల మాజీ ఎంపీ టీసీ రావుల మల్లయ్య నాయకులు గ్యార జగన్ సంప త్ రెడ్డి కుమ్మరి రాములు రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ పోరాటాలకు చిరునామా వీరనారి ఐలమ్మ

**వెలుతురు బాగ్ లింగంపల్లి, సెప్టెంబర్ 26:**

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు.తాను కౌలుకు తీసుకున్న భూమి మీద పండించిన పంట మీద తనకు హక్కు కావాలని భూస్వాముల దురహం కారాన్ని ఎదిరించి పోరాడిన ధీర వనిత ఐలమ్మ అని కొనియాడారు.సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ లో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా "ఐలమ్మ స్ఫూర్తి సభ" శనివారం రోజున ఉదయం 11 గంటలకు ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి TPSK రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో పదివేల గ్రామాల్లో లక్షలాది ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందని, వేల గ్రామాలు విముక్తి పొందాయని, ఈ పోరాటంలో 4 వేల మంది వీరులు అమరుల య్యారని అన్నారు. ఇదంతా ఐలమ్మ స్ఫూర్తితోనే సాధ్యమైందని, అందుకే ఐలమ్మ భూ పోరాటాల కు చిరునామాగా నిలిచారని పేర్కొన్నారు. తిరిగి

భూ పోరాటాలకు అంకురార్పణ జరుగాలని సామాజిక న్యాయం కోసం పోరాడినప్పుడే నీజమైన నివాళులు అని అన్నారు .ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం బుచ్చిరెడ్డి గారు రజిత, జ్యోత్స్న, ప్రేమ పోటీ పరీక్షల విద్యార్థులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖిల భారత పద్మశాలి సంఘం , తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం తీరుపై మండిపడ్డ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర రాజకీయ విభాగం చైర్మన్ గుంటి నగేష్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బాపూజీ జయంతి వేడుకలు చేయటానికి నిర్ణయం తీసుకుంది. గతంలో పద్మశాలి కార్పొరేషన్ అనేది లేకపో వడం వలన ఈ మధ్యవర్తులకు ఖర్చులకు డబ్బు లు మంజూరు చేసింది. కార్పొరేషన్ ఏర్పడినం దువల్ల ఖచ్చితంగా కార్పొరేషన్ చైర్మన్ ఆధ్వర్యం లోనే జరగాలి. ఇది ప్రభుత్వ నిర్ణయం. గతంలో లాగా సొంత ఎకౌంట్లో డబ్బులు వేసుకొని దొంగ లెక్కలు చూపించి కాజేసిన చరిత్ర ఎవరిది? దీనిపైన ఆర్ టి ఏ కింద సమాచారం తీసుకోవడం జరిగింది. ప్రభుత్వ నిధులు ఎప్పు డైనా ఏ ఉద్దేశంతో మంజూరైనవో ఆ యొక్క సమిష్టి సంఘం అకౌంట్లో వెయ్యాలి. ఇది రూలు. కానీ గతంలో వారు ఇష్టం వచ్చిన విధం గా డబ్బుని వాడుకొని, ఇప్పుడు వారి చేతికి ఇవ్వ నందుకు మరొకకొంపటి ఏర్పాటు చేసుకొ ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నారు. ఇది అత్యంత బాధ్యతారాహిత్యం మరియు సిగ్గుచేటు. ప్రభుత్వం, గొప్ప నాయకు ల జయంతి వేడుకలు ప్రభుత్వ ధనంతో నిర్వహి స్తున్నప్పుడు, ప్రతి పద్మశాలి బిడ్డ హాజరై ఆ మహానుభావుడికి అర్పించాలి. కానీ సోదర సంఘం ఏం చేస్తుంది? ప్రభుత్వం అంటే మాకు లెక్క కాదు, మేమే ప్రభుత్వాన్ని ప్రశ్నిం చగల దమ్మున్నోళ్ళం. కావున మేము ప్రభుత్వాని కి వ్యతిరేకంగా జయంతి కార్యక్రమం నిర్వహి స్తామని వారు ప్రభుత్వానికి సవాలు విసిరినారు. ఈ విధంగా సమాజానికి కుల సంఘాలు కనిపి స్తే రేపు ఏ రాజకీయ పార్టీ వీళ్ళని దగ్గరకు తీయ దు. వీరితోటి అయ్యేది లేదు పోయేది లేదని ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు ఒక అభిప్రా యం ఉంది. ఊతమిచ్చినట్టుగా ఈ మహాను భావులు వారి స్వార్థం కొర కు కార్యక్రమాన్ని తల పెట్టడం పద్మశాలి సమా జానికి హానికరం. కావున పద్మ శాలి కులంలో పుట్టిన ప్రతి బిడ్డ దీని విషయం ఆలోచించాలి. ప్రభు త్వం కూడా ఈ విధంగా వ్యవహరించినటువంటి విషయం లో ఆలోచన చేయాలని కోరుతున్నాము.

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

శనివారం రోజున మేడ్చల్ జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎడి & టీజీవో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలవడం మరియు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల కోసం తెలుసుకోవడం జరిగింది కార్యక్రమంలో ఎం బి కృష్ణ యాదవ్ టీజుంహైదరాబాద్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్.

రవీందర్. సీతారాం. నవీన్. ప్రభాకర్. పాల్గొన్నారు.

# అనిత కిరణ్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆశీర్వాదం..

**కూకట్ పల్లి సెప్టెంబర్ 26 వెలుతురు:**

బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, సోషల్ మీడియా వారియర్ అనిత కిరణ్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అనిత కిరణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, మాజీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకురాళ్లు కవిత, స్వప్న తదితరులు పాల్గొని అనిత కిరణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురిగి నరసింహ గౌడ్

**మునుగోడు వెలుతురు సెప్టెంబర్ 26:**

శనివారం రోజున కృష్ణాపురం గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో ఉన్న శ్రీ ఫ్రెండ్స్ పవర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్

# నారాయణగూడలో మెగా జాబ్ మేళా..

- సద్వినియోగం చేసుకోవాలన్న మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు. నారాయణగూడలోని కేశవ మెమోరియల్ హైస్కూల్ లో ఈనెల 27వ తేదీన ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి సాయం త్రం 5 గంటల వరకు జరగనుంది. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొని, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల కు

ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది ఒక చక్కటి అవకాశమని, నిరుద్యోగులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహాలక్ష్మి రామన్ గౌడ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా అవ్వారి భాస్కర్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలో అవ్వారి భాస్కర్‌ను రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించారు.చేనేత రంగం, జర్నలిస్టు ఉద్యమం, పద్మశాలి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తున్న అవ్వారి భాస్కర్‌కు ఈ బాధ్యత అప్పగించడం పట్ల పలువురు పద్మశాలి సంఘాల నాయకులు, చేనేత కార్మికులు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఆయన సామాజిక సేవా స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే విధంగా 111వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ కృషి చేయనుంది.ఈ సందర్భంగా రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అవ్వారి భాస్కర్ మాట్లాడుతూ, బాపూజీ జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జయంతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు, పద్మశాలి సంఘాల నాయకులు, యువత, చేనేత కార్మికులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.బాపూజీ ఆశయాల

సాధనకు ఐక్యంగా ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అవ్వారి భాస్కర్ పేర్కొన్నారు.




# పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవాలి

- ప్రపంచ పటంలో రాష్ట్ర పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి
- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు
- పీపీపీ విధానంలో మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- శిల్పారామంలోని సాంప్రదాయ వేదికలో ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 వేడుకలు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 26:**

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)లను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన "డిజిటల్ అజెండా – ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు" ప్రాధాన్యతను వివరిస్తూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని గ్లోబల్ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, అద్భుత చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు.

### పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, బడ్జెట్ పెంపు:

గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (PPP) పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని స్పష్టం చేశారు. వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈఓలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు 'టూరిజం కూపన్లు' అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పర్యాటకం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిస్తూ, తెలంగాణ పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల కోసం బీసీలు పోరాడాలి

- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

బీసీల హక్కులు, అభ్యున్నతి కోసం బీసీ వర్గాలన్నీ కలిసి ఐక్యంగా పోరాడాలని శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. బీసీ జనగణనలో తమ వర్గాలను చేర్చాలన్న డిమాండ్‌పై కొనసాగుతున్న పోరాటానికి తాము అండగా ఉంటామని చెప్పారు.శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు.భూస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని మంత్రి అన్నారు. అదే స్ఫూర్తితో రజకులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. రజక సోదరులు తమ సమస్యలు, హక్కుల సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నారని తెలిపారు.తాను ఎంపీగా ఉన్న సమయంలో పెద్దపల్లిలో మూడు విగ్రహాల ఏర్పాటుకు కృషి చేశానని వివేక్ వెంకటస్వామి తెలిపారు. గోదావరిఖని, చెన్నూరు ప్రాంతాల్లో రజక సంఘాల నాయకులు కమ్యూనిటీ భవనాలు, ప్లాట్‌ఫారమ్‌లు నిర్మించాలని కోరినప్పుడు నిధులు కేటాయించానని చెప్పారు. మందమర్రిలోనూ రజకుల కోసం రెండు చోట్ల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.రజకులకు సమాజంలో తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందన్నారు. వారి హక్కులు, ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక వార్డుల్లో బీసీల జనాభా, ప్రాతినిధ్యం గణనీయంగా ఉందని మంత్రి అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలు విజయాలు సాధిస్తున్నప్పటికీ, పెద్ద ఎన్నికల్లోనూ అదే స్థాయిలో ప్రాతినిధ్యం సాధించాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలపై సుదీర్ఘకాలంగా కొనసాగిన వివక్షను దృష్టిలో ఉంచుకుని వారికి చట్టపరమైన రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. ప్రస్తుతం బీసీ వర్గాల్లోనూ మంచి నాయకత్వం, సమర్థులైన నాయకులు ఉన్నారని తెలిపారు. బీసీలందరూ ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడితే తప్పకుండా ఫలితాలు సాధించవచ్చని అన్నారు. బీసీల హక్కుల కోసం ఆర్. కృష్ణయ్య నిరంతరం పోరాడుతున్నారని మంత్రి తెలిపారు. బీసీల అభ్యున్నతి కోసం వి. హనుమంతరావు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. ఏ

కార్యక్రమం జరిగినా హనుమంతరావు ముందుగా వచ్చి చివరి వరకు ఉండే పట్టుదల ఆయనలో ఉందని అన్నారు. బీసీల కోసం ఆయన చేస్తున్న నిరంతర పోరాటం అభినందనీయమన్నారు. తమ కుటుంబంపై బస్వరాజు సారయ్య ఎల్లప్పుడూ ప్రత్యేకమైన ప్రేమ, అభిమానం చూపుతుంటారని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తనతో పాటు తన సోదరుడు వినోద్ వెంకటస్వామిపై సారయ్యకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. బీసీల హక్కుల సాధన కోసం అందరం కలిసి ఐక్యంగా పోరాడాలని మంత్రి అన్నారు.

# నవంబర్ రెండోవారంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

- 2027 వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు
- భద్రత, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండోవారంలో ప్రారంభించి, 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు.మూడు బ్యారేజీల భద్రతను పటిష్టం చేయడంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు.హైదరాబాద్ బేగంపేటలోకి కుందన్ బాగ్ లో ఉన్న తన అధికారిక క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్–ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని మంత్రి తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చొరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. "బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే ప్రతి పని జరుగుతుంది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న న్యూఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు. కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫార్సులు చేస్తారని తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి

కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లను పిలిచి, పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠిన మైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా, సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు."పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం" అని మంత్రి తేల్చిచెప్పారు.డిజైన్ల పరిశీలన నుంచి టెండర్లు, పనుల అమలు, తుది భద్రతా ధ్రువీకరణ వరకు ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, సెప్టెంబర్ 26 (వెలుతురు):**

చాకలి ఐలమ్మ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. భూమి, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం, ధైర్యసాహసాలకు చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, భావితరాలకు ఆమె జీవితం మార్గదర్శకంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో ప్రేమ్‌రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డి. విశాల్, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, డీఐఈఓ సులోచన రాణి, జీఎం ఇండస్ట్రీస్ భారతి, వివిధ కుల సంఘాల నాయకులు, సభ్యులు, జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ బస్‌స్టేషన్‌లో డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్
- అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి

**కరీంనగర్, వెలుతురు, సెప్టెంబర్ 26:**

కరీంనగర్ పట్టణంలోని డా. బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ భీంరావు రాంజీ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2013లో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్ బస్‌స్టేషన్‌కు డా. బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టినట్లు తెలిపారు. సుమారు 13 ఏళ్ల అనంతరం అదే బస్‌స్టేషన్ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, దొంత రాజయ్య తదితరులు చేసిన కృషిని ఆయన అభినందించారు.డా. బీఆర్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని మంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడంతో పాటు అణగారిన వర్గాలకు ఆత్మగౌరవంతో జీవించే అవకాశాన్ని కల్పించిందన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం బలమైన పునాది వేసిందని తెలిపారు.ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే బస్‌స్టేషన్ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేకతను సంతరించుకుందని, ప్రతి రోజూ వేలాది మంది ఆయన విగ్రహాన్ని చూస్తూ రాజ్యాంగ విలువలను గుర్తుచేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. యువత అంబేద్కర్ జీవితం, ఆలోచనలు, పోరాటాలను అధ్యయనం చేయాలని సూచించారు. అంబేద్కర్ స్ఫూర్తితో పాటు జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు.అదేవిధంగా ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని

పురస్కరించుకుని ఆమె పోరాట స్ఫూర్తిని కూడా మంత్రి స్మరించుకున్నారు.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయంఅందే సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందిస్తూ, ఆయన ఆశయాలను జీవితంలో ఆచరించడమే మహనీయుడికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధు లు, కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ, లైబ్రరీ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రతిభావంతులకు అండగా లీగల్ ఎయిడ్ క్లినిక్

**సూర్యాపేట, సెప్టెంబర్ 26 (వెలుతురు):**

శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్న ప్రత్యేక ప్రతిభావంతులకు చట్టపరమైన రక్షణ, ఉచిత న్యాయ సేవలు అందించేందుకు సూర్యాపేట సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ (న్యాయ సహాయ కేంద్రం) ఏర్పాటు చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, స్కీమ్–2024 నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పి. శివరామ్ ప్రసాద్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి భవ్య కోవిలతో కలిసి శనివారం ప్రారంభించారు.

### హక్కుల రక్షణకు మార్గదర్శి: జడ్జి

బాధితులకు ఉచిత న్యాయ సలహాలు, సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తా మని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సుదర్శన్ రెడ్డి, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్యానెల్ న్యాయవాది దావుల చిన్న వీరప్రసాద్, పాల్గొన్నారు.

# శిక్షణ, భద్రతపై పెట్టుబడిని ఖర్చుగా కాదు.. పరిశ్రమ భవిష్యత్తుపై పెట్టుబడిగా చూడాలి

- భద్రతపై ముందస్తు పెట్టుబడితో పరిశ్రమల్లో భారీ నష్టాలను నివారించవచ్చు
- AI యుగంలో నైపుణ్యాల అప్‌గ్రేడేషన్ తప్పనిసరి
- మారుతున్న ఉద్యోగ ప్రపంచానికి అనుగుణంగా స్కిల్ సెట్ మార్చుకోవాలి
- నైపుణ్యాలున్న యువతకు ప్రపంచ వ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది
- 65 ITIలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించాం
- శిక్షణ పొందిన ప్రతి యువకుడికి ఉద్యోగ అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

నైపుణ్యాలను నిరంతరం అప్‌గ్రేడ్ చేసుకోవడం, పరిశ్రమల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడం ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమని శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. మదీనగూడలో జరిగిన కౌన్సిల్ ఆఫ్ EHS ప్రొఫెషనల్స్ (CEP) 11వ వార్షికోత్సవ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. CEP వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పరిశ్రమల్లో ఎదురయ్యే సవాళ్లకు అనుగుణంగా ప్రొఫెషనల్స్ తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని అన్నారు. ముఖ్యంగా శిక్షణ, భద్రతకు సంబంధించిన అంశాలను పరిశ్రమలు ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు.సిగాచి ఘటనను ప్రస్తావిస్తూ.. పరిశ్రమల్లో ముందస్తు భద్రతా సూచనలను అమలు చేయడం ఎంత ముఖ్యమో వివరించారు. ముందస్తు సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుని, భద్రత కోసం రూ.20–25 లక్షల మేర పెట్టుబడి పెట్టి ఉంటే భారీ నష్టాన్ని నివారించగలిగే అవకాశం ఉండేదని అన్నారు. ప్రమాదాల అనంతరం భారీ మొత్తాలను పరిహారంగా చెల్లించాల్సి రావడం కంటే, ముందుగానే భద్రతా ప్రమాణాలు, శిక్షణపై పెట్టుబడి పెట్టడం పరిశ్రమలకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు.ఉద్యోగుల్లో జ్ఞానం, నైపుణ్యాలు పెరిగితే యాజమాన్యం నుంచి వచ్చే సమాచారాన్ని వారు వేగంగా అర్థం చేసుకుని, సమర్థవంతంగా అమలు చేయగలుగుతారని చెప్పారు. దీనివల్ల ఉద్యోగులతో పాటు పరిశ్రమలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), కొత్త సాంకేతికతల కారణంగా ఉద్యోగాల స్వరూపం వేగంగా మారుతోందని మంత్రి అన్నారు. పాత తరహా పరిశ్రమల్లో మార్పులు చోటుచేసుకుంటున్న సమయంలో కొత్త రంగాల్లో అనేక అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే యువత తమ నైపుణ్యాలను నిరంతరం అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వృద్ధుల జనాభా పెరుగుతున్న నేపథ్యంలో, యువ జనాభా అధికంగా ఉన్న భారత్‌కు అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి, దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించారని మంత్రి తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడం అత్యంత ముఖ్యమని అన్నారు.గత కొంతకాలంగా ప్రభుత్వ ITIల్లో అవసరమైన స్థాయిలో పెట్టుబడులు లేకపోవడంతో వాటిని ఆధునీకరించాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 65 ITIలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేశామని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.విద్యార్థులకు శిక్షణ పూర్తయ్యే నాటికి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందేలా కోర్సులను రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 54 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా నాణ్యమైన సాంకేతిక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.శిక్షణ అందించడం మాత్రమే కాకుండా, శిక్షణ పొందిన యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడం కూడా

బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించి, వారిని ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకుంటూ కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలు కూడా శిక్షణ, భద్రత, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.CEP 11వ వార్షికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు. భవిష్యత్‌లోనూ నాణ్యమైన అంశాలపై చర్చలు, నిపుణుల ప్రసంగాలు, ప్రొఫెషనల్స్ చురుకైన భాగస్వామ్యంతో CEP తన కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ముదిరాజుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి-మంత్రి వాకిటి శ్రీహరి

- పిల్లలకు నాణ్యమైన విద్య అందించి ప్రపంచ స్థాయిలో రాణించేలా చేయాలి-మంత్రి వాకిటి శ్రీహరి
- ముదిరాజుల సంఖ్యాబలాన్ని సామాజిక, రాజకీయ బలంగా మార్చుకోవాలి: మంత్రి వాకిటి శ్రీహరి
- బీసి డి నుంచి ఏ లోకి మార్చాలనే ప్రక్రియను ప్రారంభించాల ఆలోచనలు ప్రభుత్వం ఉంది

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 26:**

ముదిరాజుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా, సమిష్టిగా ముందుకు సాగాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.  ముదిరాజుల సమస్యలు, రిజర్వేషన్లు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తాను ఎప్పటికీ వెనుకడుగు వేయబోనని మంత్రి స్పష్టం చేశారు. “ముదిరాజుల కోసం ఏ అవకాశం వచ్చినా, నా పదవిని నా వ్యక్తిగత ప్రయోజనానికి కాకుండా జాతి ప్రయోజనానికి ఉపయోగించడమే నా లక్ష్యం” అని పేర్కొన్నారు. ముదిరాజులు సంఖ్యాపరంగా బలమైన సామాజిక వర్గమని, స్థానిక సంస్థల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లుగా అనేక మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారని మంత్రి అన్నారు. ఈ సంఖ్యాబలాన్ని మరింత రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**కులగణనతో సంఖ్యాబలం స్పష్టమైంది**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన SEEEPC కులగణనలో ముదిరాజుల జనాభా సుమారు 26.36 లక్షలు, 7.43 శాతంగా నమోదైనట్లు తాజా ప్రచురిత వివరాలు వెల్లడిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ గణాంకాలు ముదిరాజుల సంఖ్యాబలాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని, ఈ సమాచారాన్ని విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం వంటి అంశాల్లో విధానపరమైన చర్చలకు ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.  కులగణనలో లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు సాగాలి**

ముదిరాజుల చరిత్రలో పండుగ సాయన్న ఒక గొప్ప స్ఫూర్తి అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పేదలు, బడుగు వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్న వారసత్వాన్ని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.  పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా గుర్తించే అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, ముదిరాజు ప్రతినిధులతో కలిసి చేసిన ప్రయత్నాలకు ఫలితం లభించిందని మంత్రి తెలిపారు.

**విద్యతోనే భవిష్యత్ మారుతుంది**

ముదిరాజు కుటుంబాలు తమ పిల్లలను తప్పనిసరిగా ఉన్నత విద్య చదివించాలని మంత్రి సూచించారు. “ముదిరాజు బిడ్డ అమెరికాకు ఎందుకు వెళ్లకూడదు? పెద్ద వ్యాపారవేత్త ఎందుకు కాకూడదు? ఐఏఎస్, ఐపీఎస్ ఎందుకు కాకూడదు?” అని ప్రశ్నించారు.  సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని, ముదిరాజు యువత ఉన్నత విద్య, ఉద్యోగాలు, వ్యాపారం, సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. సమాజంలో ఇప్పటికే అనేక మంది ముదిరాజులు ఉన్నత స్థాయికి ఎదిగారని, వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**ఐక్యతతోనే హక్కుల సాధన**

కులాభిమానం ఉండాలి కానీ అదే మొత్తం సమాజానికి పరిమితి కాకూడదని మంత్రి అన్నారు. సమాజంలోని

ఇతర వర్గాలతో కలిసి ముందుకు సాగుతూ, రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడాలని సూచించారు.  “మనమంతా ఒక మాట మీద నిలబడితేనే మన హక్కులను సాధించుకోగలం. చట్టసభల్లో మన ప్రాతినిధ్యం పెరిగితేనే మన సమస్యలను బలంగా వినిపించగలం” అని మంత్రి అన్నారు.  ముదిరాజుల హక్కుల కోసం జరుగుతున్న ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని, ఈ విషయంలో తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.  “మన పిల్లల భవిష్యత్ కోసం, మన సమాజ అభివృద్ధి కోసం, రాబోయే తరాల హక్కుల కోసం మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదాం” అని మంత్రి పిలుపునిచ్చారు.

# కిష్టాపురం గ్రామంలో గణనాథుని పూజలో పాల్గొన్న సురిగి నరసింహ గౌడ్ దంపతులు

**మునుగోడు వెలుతురు సెప్టెంబర్ 26:**

శనివారం రోజున కిష్టాపురం గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి టెంపుల్ ఆవరణలో శ్రీ ఫ్రెండ్స్ పవర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని సన్నిధిలో మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ సతి సమేతంగా గణనాధునికి పూజలు

నిర్వహించడం జరిగింది.

# 50 గంటల ప్రజా కళాజాతర ప్రారంభం

- ప్రజా కళలు, సంస్కృతిని కాపాడుకోవాలి జానపద కళా రూపాలను భావితరాలకు అందించాలి: వక్తలు

**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 26:**

ప్రజా కళలు, జానపద కళారూపాలు, ప్రజా సంస్కృతిని పరిరక్షిస్తూ వాటిని భావితరాలకు అందించాలనే సందేశంతో 50 గంటల ప్రజా కళాజాతర ప్రారంభమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ కళ్యాణ మండపం వరకు వేలాది మంది కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. వివిధ జానపద, ప్రజా కళారూపాలను ప్రదర్శిస్తూ కళాకారులు ర్యాలీలో పాల్గొన్నారు.ఆర్టీసీ కళ్యాణ మండపం వద్ద అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జెండాను సీనియర్ కార్యకర్త అంబిక ఆవిష్కరించగా, మల్సూర్ ‘ఓ అరుణ పతాకమా’ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని ప్రొఫెసర్ శాంతా సిన్హా ప్రారంభించారు.

ప్రజా ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమం, బహుజన బతుకమ్మ కార్యక్రమాల్లో విమలక్క ఐదు దశాబ్దాలుగా నిర్వహించిన కార్యక్రమాలను ప్రతిబింబించేలా గ్యాలరీని ఏర్పాటు చేశారు.ప్రజా కళాజాతర సభను ‘అంకురం’ సినిమా దర్శకుడు ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ప్రజా సంస్కృతి ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ వాస్తవాల వైపు నిలుస్తుందని ఆయన అన్నారు. జానపద కళారూపాలు ప్రజల గుండెచప్పుడని, వాటిని ఆధునీకరించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా కళారూపాలను యువతరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఐదు దశాబ్దాలుగా విమలక్క ప్రజా కళలు, ప్రజా ఉద్యమాలతో మమేకమై పనిచేయడం ప్రస్తావనీయమన్నారు.విమలక్క నేతృత్వంలో సిగ్నేచర్ డాన్స్, అమరులకు నివాళిగా ‘వీరుల సన్నిధి’ పాట ప్రదర్శించారు. వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు సమన్వయకర్తగా వ్యవహరించి ప్రజా కళాజాతర కీనోట్‌ను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు భాషా సింగ్, ప్రొఫెసర్లు జయధీర్ తిరుమలరావు, చక్రధరరావు, వినయ్‌బాబు, కట్టా భగవంతరెడ్డి, రమేష్ పోతుల, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

K. A. KUMAR
Medical Tourism Business Development Consultant

S9 CONSULTING
— TRUTH AND SERVICE —

+91 98491 94366
s9consulting@gmail.com
www.s9consulting.in

SOFT SKILLS TRAINING | CAREER COUNSELING | RURAL DEVELOPMENT PROGRAMS | SALES & MARKETING INDUCTION | CARE, NIC & LIC INSURANCES | BANKING & FINANCIAL PROGRAMS | R.W.A & N.G.O SERVICES | SOCIAL SERVICE CAMPAIGNS

# TELANGANA GOVERNMENT HOSPITALS COMPREHENSIVE SAFETY AUDIT CHECKLIST

SAFE HOSPITALS SAVE LIVES

**Fire • Electrical • Structural • Equipment • Patient Safety • Workplace Safety**

Following the safety-audit directions issued at the review chaired by Hon'ble Health Minister **Sri C. Damodar Rajanarsimha** – September 2026.

Complete the initial safety audits within **30 DAYS**; Fire & Electrical audits every **6 MONTHS**; Structural audit **ANNUALLY**.
Deficiencies must have time-bound corrective action; life-threatening deficiencies: immediate action.

- **EMERGENCY — IMMEDIATE** Life-threatening risk. Immediate action.
- **IMMEDIATE** Urgent correction required.
- **ROUTINE** Scheduled correction.
- **VERIFIED** Evidence / document checked.

## 1 FIRE & LIFE SAFETY

- ☐ Fire alarms and detection panels functional
- ☐ Manual call points available and working
- ☐ Fire extinguishers – correct type, pressure, access, service date
- ☐ Hydrants, hose reels and pumps functional
- ☐ Fire water tanks and lines in good condition
- ☐ Sprinklers functional
- ☐ Emergency lighting working
- ☐ Illuminated exit signage provided
- ☐ Fire doors functional
- ☐ Clear escape routes and staircases
- ☐ Emergency exits unlocked and unobstructed
- ☐ Fire NOC / certificates and inspection records
- ☐ Fire control room operational
- ☐ Fire wardens appointed and trained
- ☐ Evacuation maps displayed
- ☐ Regular fire drills / mock drills conducted
- ☐ Sensitive-zone evacuation plans (ICU, OT, SNCU/NICU, Emergency, Radiology/Diagnostics, Dialysis, etc.)

## 2 ELECTRICAL SAFETY

- ☐ Incoming supply and panels in good condition
- ☐ Wiring and insulation safe
- ☐ MCB/ELCB/RCCB and earthing functional
- ☐ Load assessment; no overheating
- ☐ Sockets and extension / multi-plug use safe
- ☐ UPS / inverters functional
- ☐ DG sets / generators, fuel, ATS and maintenance
- ☐ Electrical rooms clean and accessible
- ☐ Emergency power to critical areas available
- ☐ Preventive maintenance / testing records

## 3 STRUCTURAL SAFETY

- ☐ Building, roof, walls and slabs in good condition
- ☐ No major cracks, settlement, seepage or corrosion
- ☐ Structural stability certificate / audit available
- ☐ Stairs, ramps, railings and balconies safe
- ☐ Ceiling / false-ceiling safety ensured
- ☐ Boundary walls stable
- ☐ Accessibility and emergency egress adequate
- ☐ Lift shafts and structural condition sound

## 4 HVAC / OXYGEN / MEDICAL EQUIPMENT

- ☐ Air-conditioning units, electrical safety and PM
- ☐ Oxygen generation / supply system functional
- ☐ Pipelines, valves, alarms and backup cylinders/tanks
- ☐ Leak checks and medical gas safety ensured
- ☐ Ventilators, monitors, suction, pumps functional
- ☐ Critical equipment in working condition
- ☐ Preventive maintenance / calibration records
- ☐ Equipment service tags and downtime logs

## 5 EMERGENCY PREPAREDNESS

- ☐ Hospital emergency response protocol
- ☐ Incident command / responsibility matrix
- ☐ Emergency numbers displayed
- ☐ Evacuation routes and assembly points
- ☐ Staff training conducted
- ☐ Mock drills conducted regularly
- ☐ Patient transport / evacuation equipment
- ☐ Special plans for immobile patients and critical-care zones (ICU, OT, NICU, etc.)

## 6 WASTE & ENVIRONMENTAL SAFETY

- ☐ Biomedical waste segregation at source
- ☐ Colour-coded containers used
- ☐ Collection, storage and authorised transport
- ☐ Treatment and records maintained
- ☐ Biomedical waste authorization / consents
- ☐ Incinerator installed? ☐ YES ☐ NO
- ☐ If installed, operational? ☐ YES ☐ NO
- ☐ Emissions / maintenance records
- ☐ Solid waste segregation and disposal
- ☐ Liquid waste / sewage treatment and discharge compliance
- ☐ Hazardous / sharps / pharmaceutical waste controls
- ☐ Waste areas away from fire / electrical sources

## 7 WASHROOMS & HYGIENE

- ☐ Functional toilets
- ☐ Adequate water supply
- ☐ Proper drainage
- ☐ Cleanliness and disinfection
- ☐ Adequate ventilation
- ☐ Lighting in working condition
- ☐ Accessible toilets for differently-abled
- ☐ Handwashing stations with consumables
- ☐ Maintenance log; separate arrangements for patients/staff

## 8 LIFTS & VERTICAL TRANSPORT

- ☐ Valid inspection / maintenance certificate
- ☐ Emergency alarm / intercom working
- ☐ Power backup available
- ☐ Door safety and sensors functional
- ☐ Overload protection
- ☐ Rescue procedure defined and displayed
- ☐ Lift machine room safety
- ☐ Service log maintained
- ☐ Accessible lift for patients

## 9 POSH / WORKPLACE SAFETY

- ☐ POSH training conducted and records available
- ☐ Internal Committee (ICC) constituted by written order
- ☐ Presiding Officer is a woman at senior level
- ☐ At least two employee members
- ☐ One external member
- ☐ At least half of total members are women
- ☐ ICC member names, designations, contact details and tenure displayed
- ☐ Complaint procedure and confidentiality notice displayed
- ☐ DISPLAY APPROVED TOLL-FREE / HELPLINE NUMBER
- ☐ Periodic awareness / training conducted
- ☐ Annual reporting / compliance records

## 10 GOVERNANCE & CORRECTIVE ACTION

- ☐ Record location, deficiency, risk class, responsible officer, corrective action, budget/source, target date, completion date, verification officer, photographic/documentary evidence and closure status for each finding.
- ☐ District-level monitoring and escalation for overdue critical findings.

## HOSPITAL AUDIT SNAPSHOT

| | |
|---|---|
| Hospital Name : ______ | Fire / Electrical / Structural Auditors : ______ |
| District : ______ | Overall Open Findings : ______ |
| Beds : ______ | Emergency Findings : ______ |
| Date of Audit : ______ | Immediate Findings : ______ |
| Audit Team : ______ | Routine Findings : ______ |
| Superintendent / Medical Superintendent : ______ | Closure Due Date : ______ |

**AUDIT IS NOT COMPLETE UNTIL THE DEFICIENCY IS CORRECTED, VERIFIED & CLOSED.**

S9 CONSULTING — TRUTH AND SERVICE | Contact Ashwin: +91 98491 94366 | s9consulting@gmail.com | www.s9consulting.in

**Reference framework:** Telangana safety-audit directions reported 25 Sep 2026; MoHFW healthcare fire & life-safety guidance; applicable statutory requirements.
Hospital-specific statutory compliance must be verified against current Government Orders, Fire Service requirements and applicable law.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com